ప్రజాశక్తి

శుక్రవారం 20 సెప్టెంబర్ 2024 | 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

రుణాల రీషెడ్యూల్‌కు దరఖాస్తు చేసుకోండి

ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి నివాస్

ప్రజాశక్తి - విజయవాడ : వరద బాధిత ప్రజల రుణాల రీషెడ్యూలింగ్ కోసం ప్రత్యేక బ్యాంకింగ్ సేవల ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి జె.నివాస్, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. విజయవాడ సబ్ కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన ప్రత్యేక ఇన్స్యూరెన్స్ ఫెసిలిటేషన్ కేంద్రం విజయవంతమైన నేపథ్యంలో ఇదే తరహాలో దీనిని ఏర్పాటు చేస్తామన్నారు. లీడ్ బ్యాంక్ యుబిఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జె.నివాస్, జి.సజన గురువారం బ్యాంకర్లు, బీమా సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జె.నివాస్ మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంత ప్రజలకు లబ్ధి చేకూర్చేందుకు బ్యాంకులు ముందుకొచ్చి కల్పించిన రుణాల రీషెడ్యూలింగ్ సౌకర్యాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వినియోగ రుణాలు, కొత్త మూలధన రుణాలూ పొందేందుకు వీలున్న నేపథ్యంలో బ్యాంకులకు దరఖాస్తులు సమర్పించాలన్నారు. ముంపు ప్రభావంతో కష్టాల్లో ఉన్న బాధితులకు భరోసా కల్పించేలా, విశ్వాసం పెంపొందించేలా బ్యాంకులు విజయవాడలోని 179 సచివాలయాలతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలకు సేవలందించాలని కోరారు. ఏడాది మారటోరియంతో రుణాల రీషెడూల్ చేయడంతోపాటు ముంపుబారిన పడిన గ్రౌండ్‌ఫ్లోర్ కుటుంబాలకు రూ.50 వేలు, మొదటి, ఆపై అంతస్తుల్లో ఉన్న కుటుంబాలకు రూ.25 వేల వినియోగ రుణాలు మంజూరు చేయొచ్చన్నారు. అలాగే ఈ రుణాలకు మూడు నెలల మారటోరియం, 36 నెలల రీపేమెంట్ పీరియడ్ వర్తిస్తుందన్నారు. చిన్న వ్యాపార, వాణిజ్య సంస్థలకు తమ అవసరాలకు అనుగుణంగా పెట్టుబడికోసం కొత్త రుణాలు కూడా మంజూరు చేయొచ్చన్నారు. సహజ విపత్తు ప్రభావిత జిల్లాకు ఆర్‌బిఐ మార్గదర్శకాల ప్రకారం అందించాల్సిన అన్ని సహాయసహకారాలనూ అందించేందుకు బ్యాంకర్లు కృషిచేయాలన్నారు. బల్క్ మెసేజ్‌లతోపాటు నేరుగా కూడా మాట్లాడి బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకునేలా వరద ప్రభావిత ప్రాంత ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. నీట మునిగిన గ్రౌండ్‌ఫ్లోర్‌లోని ఒక్కో కుటుంబానికి రూ.25 వేలు చొప్పున, మొదటి, ఆపై అంతస్తుల్లోని ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున పరిహారాన్ని ముఖ్యమంత్రి ఇప్పటికే

(మిగతా 2లో)

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి జె.నివాస్, చిత్రంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ఆక్వా హబ్‌గా ఏపి

శాం ఆక్వా ప్రాసెసింగ్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో మంత్రి కొల్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : రాష్ట్రాన్ని ఆక్వా రంగానికి హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పామర్రు మండలం కురుమద్దాలి గ్రామంలో ఏర్పాటు చేసిన శాం ఆక్వా ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోది వర్చువల్‌గా ప్రారంభించగా, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మతో కలిసి మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. రాష్ట్రానికి 970 కిలోమీటర్లకు పైగా సముద్ర తీర ప్రాంతం ఉందని, దాన్ని ఆధారంగా చేసుకుని లక్షలాది మంది జీవిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో 2014-19 మధ్య కాలంలో రాష్ట్ర మత్స్య ఉత్పత్తుల్ని అంతర్జాతీయ మార్కెట్లో విక్రయించడం ద్వారా వేల కోట్ల ఆదాయం పొందామని గుర్తుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహంతో రాష్ట్రవ్యాప్తంగా సముద్ర తీర ప్రాంతంలో ఆక్వా హబ్‌లను ఏర్పాటు చేశామన్నారు. యూనిట్ విద్యుత్ రూ.2లకే అందించామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి అందించే సబ్సిడీలను అందిపుచ్చుకుని మత్స్య రంగం పురోభివద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో రొయ్యల ప్రాసెసింగ్ మాత్రమే జరుగుతోందని, త్వరలోనే చేపల ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఎంఎస్ఎంఈ రంగానికి ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని కూడా జత చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఏపీ మత్స్య రంగాన్ని, ఫుడ్ ప్రాసెసింగ్ వ్యవస్థను దేశానికే ఆదర్శంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దాదాపు 2000 మందికి ఉపాధి కల్పించేలా శాంఆక్వా ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన వెలగపూడి సాంబశివరావు, ఆయన కుమారుడు వెంకటేశ్వరరావు వ్యాపారంలో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

పరిహారం, ప్యాకేజీ పెంచాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు
- వరద బాధిత ప్రాంతాల్లో పర్యటన
- కొనసాగిన భోజనం పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ : వరద బాధితులకు ఇంకా ప్రభుత్వం ఆర్థికం సాయం అందించలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు పేర్కొన్నారు. వరద నష్టంతో పోలిస్తే ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ తక్కువన్నారు. పాలాభిషేకాలు ఆపి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు సాధించడంపై దష్టి పెట్టాలన్నారు. కండ్రిక కాలనీ తదితర ప్రాంతాల్లో బాబురావు, సిపిఎం నేతలు పర్యటించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగర్ (కండ్రిక కాలనీ)లో కొనసాగుతున్న సిపిఎం భోజనం పంపిణీ

(మిగతా 2లో)

కండ్రికలో భోజనం కోసంక్యూలో బాధితులు

వరద బాధితుల రుణాలపై బ్యాంకింగ్ సేవలకు

నేటి నుండి ప్రత్యేక ఫెసిలిటేషన్ సెంటర్

ప్రజాశక్తి - విజయవాడ : భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందించేందుకు ప్రత్యేకంగా విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 20వ తేదీ నుండి బ్యాంకింగ్ ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రంలో రుణాల రీషెడ్యూల్, వినియోగ రుణాలు, మూలధన రుణాలు వంటి సేవలు పొందొచ్చని, అక్కడికక్కడే దరఖాస్తులు పరిష్కరిస్తారని తెలిపారు. వివిధ బ్యాంకుల ప్రతినిధులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ముంపు బాధితులు తమ పరిధిలోని బ్యాంకులు లేదా లీడ్ బ్యాంక్ యూబిఐ భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక ఫెసిలిటేషన్ కేంద్రం ద్వారా సేవలు పొందొచ్చని తెలిపారు.

టిడిపి కార్యకర్తలపై దాడి

- ఇద్దరికి గాయాలు, కారు ధ్వంసం
- కంచికచర్లలో పోలీసు పికెట్ ఏర్పాటు

ప్రజాశక్తి - కంచికచర్ల : ఎన్నికల సమయంలో తలెత్తిన వివాదాల నేపథ్యంలో చోటుచేసుకున్న పాత కక్షలను పురస్కరించుకొని వైసిపి శ్రేణులు జరిపిన దాడిలో ఇద్దరు టిడిపి కార్యకర్తలకు తీవ్ర గాయాలుకాగా, ఓ కారు ధ్వంసమైంది. పోలీసుల కథనం ప్రకారం... ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల మండలం కీసరలో బుధవారం అర్ధరాత్రి వరకు టిడిపికి చెందిన వారు వినాయకుని నిమజ్జనం వేడుకలు నిర్వహించారు. మునేటిలో నిమజ్జనం పూర్తయిన తర్వాత ఆ గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలు యరగొర్ల విజయ్, రాయల గోపి తదితరులు కారులో ఇంటికి వెళుతున్నారు. ఈ సమయంలో వైసిపి నాయకుడు పరిటాల రాము, ఆయన సోదరుడు నూకార్జున్ మరో 10మంది కార్యకర్తలు దారి కాచి కారులో ఉన్న వారిపై కర్రలతో దాడి చేశారు. దీంతో విజయ్, గోపిలకు తీవ్ర గాయాలు కాగా, వారి కారు ధ్వంసమైంది. నందిగామ రూరల్ సిఐ చవాన్, కంచికచర్ల ఎస్ఐ బి.రాజు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు వైసిపి నాయకులు పరిటాల రాము, నూకార్జున్, సాంబయ్య, మరో పది మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. నిందితులు రాము, నూకార్జున్, సాంబయ్య, మరో ఐదుగురిని గురువారం అరెస్టు చేసి నందిగామ కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు. గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

గాయపడ్డ టిడిపి కార్యకర్త

ధ్వంసమైన కారు

నేటి నుండి యుపిఎస్‌సి మెయిన్ పరీక్షలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఈనెల 20 నుండి 22వ తేదీ వరకు, తిరిగి ఈనెల 28, 29 తేదీల్లో ఐదు రోజులపాటు జరిగే యుపిఎస్‌సి మెయిన్ పరీక్షలకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు డిఆర్‌ఒ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈపరీక్షల ఏర్పాట్లపై గురువారం ఆయన నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో లైజనింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ లైజనింగ్ ఆఫీసర్లు, వెన్యూ సూపర్ వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డిఆర్‌ఒ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నగరంలోని మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో ఈనెల 20, 21, 22 తేదీలు, ఈనెల 28,29 తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈపరీక్షలకు 136 మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. 20వ తేదీ ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1 ఎస్ఎ పరీక్షను, 21వ తేదీ ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్ -2లో జనరల్ స్టడీస్-1, మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్ -3లో జనరల్ స్టడీస్ -2 పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. 22వ తేదీ ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్ -4లో జనరల్ స్టడీస్-3, జనరల్ స్టడీస్ -4 పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. తిరిగి 28వ తేదీ ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-ఏలో ఇండియన్ లాంగ్వేజ్, మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్ -బి ఇంగ్లీష్, 29వ తేదీ ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్ -6లో ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5:30 గంటల వరకు పేపర్-7లో ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్-2 పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పరీక్షల నిర్వహణకు ఏడుగురు ఇన్విజిలేటర్లను, ఇద్దరు వెన్యూ సూపర్వైజర్లను, ఇద్దరు అసిస్టెంట్ సూపర్వైజర్లను నియమించామని తెలిపారు. ఒక విభిన్న

(మిగతా 2లో)

బీమా క్లెయిమ్‌ల పరిష్కారం వేగవంతం

- కలెక్టర్ డాక్టర్ సృజన
- ఇప్పటికే రూ.27.93 కోట్ల విలువైన 4,500 క్లెయిమ్‌ల పరిష్కారం

ప్రజాశక్తి - విజయవాడ : భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన, దెబ్బతిన్న వాహనాలు, ఇళ్లు, దుకాణాలతోపాటు చిన్న, మధ్య తరహా వ్యాపార సముదాయాలు వంటి ఆస్తులకు సంబంధించిన బీమా క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరిస్తున్నామని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సజన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రూ.27.93 కోట్ల విలువైన 4,500 క్లెయిమ్‌లను పరిష్కరించినట్లు తెలిపారు. విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన బీమా ఫెసిలిటేషన్ కేంద్రంలో రూ.79.86 కోట్ల విలువైన 10,130 మోటారు వాహనాల క్లెయిమ్‌లు రిజిస్టర్ కాగా, వీటిలో 38.54 శాతం అంటే 3,904 క్లెయిమ్‌లు (రూ.13.50 కోట్లు) సెటిల్‌మెంట్ అయినట్లు తెలిపారు. అలాగే రూ.175.54 కోట్ల విలువైన 1,593 నాన్ మోటారు క్లెయిమ్‌లు రిజిస్టర్ కాగా, వీటిలో 37.41 శాతం అంటే 596 క్లెయిమ్‌లు (రూ.14.43 కోట్లు) సెటిల్‌మెంట్ అయినట్లు పేర్కొన్నారు. మోటార్, నాన్ మోటార్ మొత్తంమీద రూ.255.4 కోట్ల విలువైన 11,723 క్లెయిమ్‌లు రిజిస్టర్ కాగా వీటిలో 38.39 శాతం అంటే 4,500 క్లెయిమ్‌లు (రూ.27.93 కోట్లు) సెటిల్‌మెంట్ చేసినట్లు వివరించారు. అలాగే ఎలక్ట్రీషియన్, ప్లంబర్, పెయింటర్, ఏసీ మెకానిక్ తదితర సేవలు పొందేందుకు 57,979 మంది అర్బన్ కంపెనీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారని తెలిపారు. ఇప్పటివరకు నికరంగా మొత్తం 4,415 సర్వీస్ రిక్వెస్టులు నమోదయ్యాయని, వీటిలో 95.7 శాతం మేర విజ్ఞప్తులకు సేవలందించడం పూర్తయిందని కలెక్టర్ వివరించారు.

విఎంసికి మందులు అందజేత

ప్రజాశక్తి - విజయవాడ : ఇటీవల వరదల వల్ల ప్రభావితమైన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సీనియర్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు మందులను అందజేశారు. గురువారం విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రను ఆయన కార్యాలయంలో కలిసి ప్రజలకు అవసరమైన మందులను అందజేశారు.

కమిషనర్ ధ్యానచంద్రకు మందులు అందిస్తున్న కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు

ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించండి

విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి - విజయవాడ : వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేస్తూ ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం ఆయన తుమ్మలపల్లి కళాక్షేత్రం రోడ్, గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్డు, బుడమేరు వంతెన, పైపుల్ రోడ్, ఉడా కాలనీ, న్యూ రాజీవ్ నగర్, కండ్రిక జర్నలిస్ట్ కాలనీ, 33 తోముల రోడ్డు, ఆంధ్రజ్యోతి రోడ్డు, పిఎన్‌టి కాలనీ, వాంబే కాలనీ, పైపుల్ రోడ్ జంక్షన్ ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని, సైడు కాల్వల్లో ఎప్పటికప్పుడు పూడికలు తీయాలని అధికారులను ఆదేశించారు. రోడ్లను పరిశుభ్రంగా ఊడవాలని, వ్యర్థాలను తొలగించాలని, ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ, దోమలు, వాటి వల్ల కలిగే వ్యాధులను యాంటీ లార్వా ఆపరేషన్లు నిరంతరం చేయాలన్నారు. ఈ పర్యటనలో విఎంసి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిల్వ ఉన్న నీటిని పరివీలిస్తున్న విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

దసరా మహోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి - విజయవాడ : ఇంద్రకీలాద్రిపై అక్టోబర్ 3 నుండి 12వ తేదీ వరకు జరిగే దసరా మహోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర తెలిపారు. విఎంసి ప్రధాన కార్యాలయంలో గల తన చాంబర్లో దసరా ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించి అన్ని శాఖల అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ దసరా ఉత్సవాలకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులకు కలకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తాగునీటి ఏర్పాట్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, క్లాక్ రూంలు, పారిశుధ్య నిర్వహణ, గుడి వరకు వెళ్లే రోడ్లకు ప్యాచ్ వర్క్‌లు వంటివి చేస్తున్నట్లు తెలిపారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా 35 లక్షల తాగునీటి వాటర్ బాటిళ్లు, ప్యాకెట్లు, 150 తాత్కాలిక మరుగుదొడ్లు, 6 క్లాక్ రూములు, 27 ప్రాంతాల్లో 1400 మంది పారిశుధ్య కార్మికులతో మూడు షిఫ్ట్‌ల్లో పారిశుధ్య నిర్వహణ, 24 ఇన్‌టూ 7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు, గిరి ప్రదక్షిణ దారిలో ప్యాచ్ వర్క్‌లు వంటి వాటికి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో లాగానే ఈసారీ భవానీలకు రెడ్ క్లాత్ కోసం కన్వేయర్ బెల్ట్, 18 ట్రాక్టర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

పారిశుధ్య కార్మికులకు సఫాయి మిత్ర సురక్ష శిబిర్

ప్రజాశక్తి - విజయవాడ

పారిశుధ్య కార్మికులు ఆరోగ్యం ఉంటేనే నగరం పరిశుభ్రంగా, అందంగా ఉంటుందని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం సఫాయిమిత్ర సురక్ష శిబిర్ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ నిత్యం పగలూ రాత్రి శ్రమించే పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో సఫాయిమిత్ర సురక్ష ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా అజిత్‌సింగ్‌నగర్లోని మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలోనే కాకుండా 40 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో మూడు వేల మందికిపైగా పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సఫయి మిత్ర సూరఖ శిబిర్‌లో పారిశుధ్య కార్మికులుకు డాక్టర్లు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేశారు. అవసరమైన పారిశుధ్య కార్మికులుకు రక్త పరీక్షలు, మధుమేహం, థైరాయిడ్ తదితర పరీక్షలు చేసి ఉచితం గా మందులు ఇచ్చారు.

పారిశుధ్య కార్మికులను పరీక్షిస్తున్న వైద్యులు

పేరుమార్పు

నాపేరు అందుగుల రాజేష్ S/o రామారావు (లేట్), నాది డోర్ నెం.1-352, డివిఆర్ కాలనీ, పొక్కునూరు గ్రామం, చందర్లపాడు మండలం, ఎన్‌టిఆర్ జిల్లా, నా పెద్దకుమారుడు పేరు జనన ధృవీకరణ పత్రం నందు **అందుగుల చిన్నబాబు** గా నమోదు కాబడి వున్నది. కాని ఆ పేరును **అందుగుల రామ్‌ఆర్యన్**గా మార్చుటకు అఫిడవిట్ దాఖలు చేయటమైనది.

జననం తేది : 14-07-2020

బర్త్ రిజిస్ట్రేషన్ నెం. B:2020:28-15035-000461

ఇట్లు

తల్లిదండ్రులు :

అందుగుల రాజేష్,

కుమ్మగిరి ప్రియాంక

మొదటిపేజీ తరువాయి

రుణాల రీషెడ్యూల్‌కు దరఖాస్తు చేసుకోండి

ప్రకటించారని తెలిపారు.

త్వరగా క్లెయిమ్‌ల పరిష్కారం

వరద ప్రభావంతో దాదాపు 48 వేల వాహనాలు దెబ్బతిన్నాయని, నష్టం వాటిల్లిన ద్విచక్ర వాహనాలు, ఆటోలకు ఇప్పటికే పరిహారం ప్రకటించారని జె.నివాస్ పేర్కొన్నారు. అలాగే ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరిస్తామన్నారు. చిన్నిచిన్న రిపేర్లు అవసరమైన వాటిని బాగుచేయించే ప్రక్రియ రెండు మూడు రోజుల్లో పూర్తవుతుందన్నారు. ఎంఎస్ఎంఇలకు సంబంధించి అన్ని విధాలా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

సమష్టి కృషితో చేయూతనందించాలి : కలెక్టర్ డాక్టర్ సృజన

వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు అధికార యంత్రాంగం అన్ని విధాలా సహకారం అందిస్తోందని, దీనికి బ్యాంకులు కూడా తోడై సమష్టి కృషితో బాధితులకు చేయూతనందించాల్సిన అవసరముందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. డిసిసి, ఎస్ఎల్‌బిసి వరుస సమావేశాలు, సిఎం మార్గనిర్దేశనం తదితరాలతో ప్రాథమికంగా ఖరారైన నిర్ణయాలను సమర్థవంతంగా అమలుచేసేందుకు బ్యాంకర్లు కృషిచేయాలని కోరారు. బీమా సంస్థలకు అందిన క్లెయిమ్‌లు, సెటిల్‌మెంట్లో పురోగతి తదితర అంశాలపైన సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో యూబిఐ రీజనల్ హెడ్ ఎం.శ్రీధర్, ఎల్‌డిఎం కె.ప్రియాంక, వివిధ బ్యాంకులు, బీమా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిహారం, ప్యాకేజీ పెంచాలి

కేంద్రాన్ని పరిశీలించారు. భోజనం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ ఇప్పటికి 1.35 లక్షల మందికి భోజనం అందించినట్లు తెలిపారు. వరద కష్టాలు ఇంకా తీరలేదన్నారు. దీంతో ప్రజారోగ్యం దెబ్బతింటోందన్నారు. ఇంటింటా జ్వరాలు, జబ్బులు విజంభించాయన్నారు. ఇంకా ఇళ్ళు శుభ్రం చేసుకునే పనులు పూర్తి కాలేదని తెలిపారు. మ్యాపింగ్ పేరుతో ఎన్యుమేషన్ పూర్తిస్థాయిలో జరగలేదని, అద్దెకు ఉన్నవారి పేర్ల నమోదుపై గందరగోళం సాగుతోందని తెలిపారు. ప్రతి ఇంట్లో దెబ్బతిన్న టివిలు, ఫ్రిజ్‌లు, ఇతర గృహోపకరణాల సమాచారాన్ని ప్రభుత్వం సేకరించిందని, ఆ నష్టాన్ని ఎలా పూడుస్తారో ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయలేదన్నారు. వ్యక్తిగత వాహనాలు దెబ్బతిని రవాణా కష్టంగా మారిందన్నారు. దీంతో ప్రజలు పనులకు వెళ్లే అవకాశం కనిపించడంలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం సహాయం అందిస్తేనే బాధితుల జీవితాలు గాడిన పడతాయన్నారు. తమ కష్టాలు, బాధలు వినే నాధుడు కనపడటం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఎవరు, ఏ సహాయం చేస్తారోనని బాధితులు ఎదురుచూస్తున్నారని, ఏ ఇంట చూసినా కష్టాలే , వ్యధలే కనిపిస్తున్నాయని తెలిపారు. బాధితులకు కనీసం రూ.50 వేలకు తగ్గకుండా పరిహారం ఇవ్వాలన్నారు. నష్టపోయిన సామగ్రి, వస్తువులు అందించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం నేతలు బి రమణ రావు, కే దుర్గారావు, టి.ప్రవీణ్, ఝాన్సీ, పీర్ సాహెబ్, వెంకట రెడ్డి, సావిత్రి, పిచ్చమ్మ, లతా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి యుపిఎస్‌సి మెయిన్ పరీక్షలు

ప్రతిభావంతులు పరీక్షలు రాసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధి విధానాలపై జిల్లా రెవెన్యూ అధికారి, పరీక్షల కస్టోడియన్ అధికారి డిఆర్వో వి. శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. ఈసమావేశంలో యుపిఎస్‌సి జాయింట్ సెక్రటరీ సంతోష్ అజ్మీరా, అండర్ సెక్రటరీ సుశీల్ కుమార్, ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, లెక్చరర్ తుంబురు ఆర్యపతి, అసిస్టెంట్ సూపెర్వైజర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్వో వి. శ్రీనివాసరావు

మహారాజశ్రీ మచిలీపట్నం సీనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో

ఇ.పి. నెం. 46/18 ఇన్ ఓ. ఎస్. నెం. 413/14

Between:

బంకూరి వెంకటేశ్వరరావు ... డి.హెచ్.ఆర్./పిటీషనర్

మరియు

మేకల వెంకట రంగనాథ్, తండ్రి మంగపతిరావు, హిందువు, డోర్. నెం. 30/272, మస్తాఖాన్‌పేట, మచిలీపట్నం. .... జె.డి.ఆర్./డిఫెండెంట్

డి.హెచ్.ఆర్ తరుపున ఇచ్చిన నోటీసు

పై నెంబరు కేసులో జె.డి.ఆర్. అయినటువంటి మేకల వెంకట రంగనాథ్‌గారి ఇ.పి. షెడ్యూలు దాఖలా ఆస్థిని శ్రీ కోర్టు వారు వేలం వేయుటకు నిర్ణయించి నారు. మీకు ఎన్నిమార్లు బేటా కట్టినను, నోటీసు పంపినను, కావాలని మీరు అందుకొనలేదు. అందు వలన శ్రీకోర్టువారి ఆర్డర్ ప్రకారం ది.30-09-2024వ తేదీన సదరు పై నెంబరు వాయిదా అయివున్నది. ఆ రోజున మీరు గౌరవనీయులైన శ్రీ కోర్టు వారి వద్ద మీరు గాని, మీ అడ్వకేటుగారు గాని హాజరుకాని పక్షంలో మీకు పరోక్షముగా గౌరవనీయులైన శ్రీ కోర్టువారు తీర్మానం చేయుదురని తెలియజేయట మైనది.

వాయిదా తేది: 30-09-2024

మచిలీపట్నం

తేది:20-09-2024

ఇట్లు

వై.వి.నాగభూషణరావు ఎమ్.ఎ., బి.ఎల్

డి.హెచ్.ఆర్. తరుపు అడ్వకేట్, మచిలీపట్నం

సెల్ నెం.9866635657

ఇసుక మేటలు తొలగించాలని వినతి

తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

ప్రజాశక్తి-ఘంటసాల : కృష్ణా నదికి ఇటీవల వచ్చిన వరదల కారణంగా పంట పొలాల్లో ఇసుక మేటలు వేయటంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, ఇసుక మేటలు తొలగింపుకు చర్యలు చేపట్టాలని సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ బి.విజయప్రసాద్ కు రైతుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని గురువారం కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఘంటసాల మండల పరిధిలోని తెలుగురావుపాలెం గ్రామంలో ఉన్న ఆది ఆంధ్ర ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ నందు 160 మంది సభ్యులు శ్రీకాకుళం గ్రామంలో ఉన్న కృష్ణా నది పరివాహక ప్రాంతంలో లంక భూములు సాగు చేసుకుంటున్నారన్నారు. కంద, పసుపు, మొక్కజొన్న, మినుము, కాయకూరలు పండిస్తుంగా, ఇటీవల కృష్ణానది వరదకు లంక భూమిలో కొంత భూమి కోతకు గురైందని, మరీ కొంత భూమి ఇసుక మేట వేసిందని, రైతులు పంటలు వేసుకోవటానికి ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. ఇసుక మేటలు తొలగించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు పెదముత్తేవి వసంతరావు, మాజీ సర్పంచ్ ఆరుంబాక రవి, సభ్యులు ఎం.శేఖర్, జె.కోటేశ్వరరావు, ఎం.నాగమల్లేశ్వరరావు, రాచూరి భాస్కరరావు, బుర్రా నాగమల్లేశ్వరరావు, పెదపూడి డాను, జె.ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జామెంట్రీ బాక్సులు పంపిణీ

ప్రజాశక్తి-పెదపారుపూడి : విద్యార్థులు బట్టి పట్టి చదువు వద్దని, అవగాహనతో కూడిన చదువు చదవాలని ఆ చదువు జీవితంలో ఎంతగానో ముందుకు నడిపిస్తుందని మార్పు ట్రస్ట్ అధినేత సుయాజ్ రావూరి ఒక ప్రకటనలో గురువారం పేర్కొన్నారు. మండలంలోని వానపాముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతి ఒక్క విద్యార్థికి జామెంట్రీ బాక్స్‌లు అందించారు. ఈ సందర్భంగా సుయాజ్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు ట్రస్ట్ సభ్యులు రావూరి చిన్న కోటేశ్వరరావు వివరించారు.

ఉషారామలో ముగిసిన క్యాంపు

ప్రజాశక్తి-ఉంగుటూరు : మండలంలోని ఉషారామ కళాశాలలో ఐడిఈ బూట్ క్యాంపు ముగిసింది. ఈ ముగింపు సమావేశంలో వాద్వాని ఫౌండేషన్ నోడల్ ఆఫీసర్ గౌరీ గోపీనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పిఎంఎస్‌హెచ్ ఇ ఎస్ పాఠశాలల నుంచి 100 మంది విద్యార్థులు, 100 మంది ఉపాధ్యాయులను భవిష్యత్తులో ఆవిష్కర్తలుగాను వ్యవస్థా పకులుగా మారడానికి అవసరమైన నైపుణ్యాలతో ప్రేరే పించడం, సన్నద్ధం చేయడం లక్ష్యంగా పెట్టుకుంటామని అన్నారు. అనంతరం సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. మేనేజర్ ఎఐసిటిఇ డాక్టర్ ఐ ఎన్ భీయా, ఏపి మోడల్ స్కూల్ రుద్రవరం నంద్యాల డిస్ట్రిక్ట్ చీఫ్ బి సాయితేజ, డాక్టర్ దీప్తి, డాక్టర్ ప్రసాద్ రాజు, కళాశాల ఛైర్మన్ సుంకర రామబ్రహ్మం, ప్రిన్సిపాల్ డాక్టర్ జి వి కె ఎస్ వి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీ షర్టులు అందజేత

ప్రజాశక్తి-గన్నవరం : ప్రతిభవంతులైన క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు ప్రతిఒక్కరు ముందుకు రావాలని కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఛైర్మన్, సీనియర్ న్యాయవాది కేవీ. రమణ పిలుపునిచ్చారు. స్థానిక కేవీఆర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 20 నుండి ప్రారంభంకానున్న జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అసోసి యేషన్ కార్యదర్శి కేవీఆర్. కిషోర్ సౌజన్యంతో టీషర్ట్ ను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ వంతులైన బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారని చెప్పారు. వీరిని వెలుగులోకి తీసుకువచ్చేందుకు జిల్లా స్థాయిలో మూడు రోజులు పాటు పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో వరుసగా నాలుగు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు రూ.60 వేలు నగదు బహుమతులతో పాటు షీల్డ్స్ అందజేయనున్నట్లు చెప్పారు. జిల్లా స్థాయి పోటీలను శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు కేవీఆర్. కిషోర్ తెలిపారు. ఈ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు మూడు రోజుల పాటు ఉచిత భోజన సదుపాయం కూడా కల్పించినట్లు చెప్పారు. అసోసియేషన్కు చెందిన పీడీ. చందు. నిడమర్తి బుజ్జారావు, పల్లమోతు రమేష్, చిమట రవివర్మ, ఋషి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : విజయవాడ వరద బాధితుల సహాయార్థం మచిలీపట్నం మైత్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో తిరిగి సేకరించిన విరాళాలు మొత్తం కలిపి రూ. 1,00,116 ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అందించారు. గురువారం వెలగపూడి సచివాలయంలో మంత్రి కొల్లు రవీంద్ర సమక్షంలో ముఖ్యమంత్రి ని కలిసి చెక్ అందజేసి మైత్రీ ఫౌండేషన్ చేస్తున్న కార్యక్రమాలు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మైత్రీ ఫౌండేషన్ ప్రతినిధులు బిబి ఎస్ ప్రసాద్, కనకరాజు, దీప్తి, వక్కంటి రమాదేవి, ఫణి,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి విరాళం అందిస్తున్న దృశ్యం



ఎంఎల్‌ఏను సత్కరిస్తున్న నాయకులు

అర్హులందరికీ పథకాలు అందించాలి : ఎంఎల్‌ఏ

ప్రజాశక్తి-పెదపారుపూడి : రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి అయిన సందర్భంగా మండలంలోని చినపారుపూడి సచివాలయాన్ని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా గురువారం సందర్శించి ప్రభుత్వ పాలనా విధి విధానాలపై అధికారులు, నాయకులకు అవగాహన కల్పించారు. నాయకులు ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ప్రభుత్వ పథకాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అందే విధంగా నడుచుకున్నప్పుడే ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చి పెట్టే వారు అవుతామని అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, నాయకులు మలినేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి-పమిడిముక్కల : గర్భిణీలు, చిన్నారులకు ప్రభుత్వం ఇచ్చే పౌష్టికాహారాన్ని ఉపయోగించుకోవాలని అంగన్వాడీ సూపర్వైజర్ ఉషా అన్నారు. గురువారం పమిడిముక్కల మండలంలోని ఎన్టీఆర్ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు ఆకుకూరలు ఫలాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఉషా మాట్లాడుతూ గర్భిణీలు ఎక్కువగా ఆకుకూరలు, పాలు తీసుకోవాలని, బిడ్డ బలంగా ఆరోగ్యంగా పుట్టడానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విజయనిర్మల పాల్గొన్నారు. ప్రజాశక్తి-పెదపారుపూడి : మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషణఅభియాన్ కార్యక్రమంలో భాగంగా శ్రీమంతాల వేడుక నిర్వహిం చారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సూపర్వైజర్ ఎం శివ నాగమణి మాట్లాడుతూ గర్భిణీలు తీసుకోవలసిన జాగ్రత్తల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, గ్రామ సర్పంచ్ అప్పికట్ల ఆశాజ్యోతి, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు

పమిడిముక్కలలో గర్భిణులకు పండ్లు అందిస్తున్న దృశ్యం

మహిళ అనుమానాస్పద మృతి

మృతురాలు శాంతి ప్రసన్న

ప్రజాశక్తి - గుడివాడ : నందివాడ మండలం వెన్నన పూడి గ్రామంలో వివాహిత అనుమా నాస్పదంగా మృతి చెందిన సంఘటన ఇది. నందివాడ పోలీసులు కథనం ప్రకారం గ్రామంలోని తుమ్మల రాజేష్ భార్య తుమ్మల శాంతి ప్రసన్న(29) ఈనెల 18వ తేదీ రాత్రి 8గంటల సమయంలో ఇంటి ప్రక్కన ఉన్న బాత్ రూంలో పై కప్పుకు ఉన్న ఇనుప రాడ్ కి తాడుతో ఉరి వేసుకుని మృతి చెందింది. భర్త హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారంటూ మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలు బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లుగా నందివాడ మండల పోలీసులు కేసు నమోదు చేశారు.

రాహుల్‌గాంధీపై వ్యాఖ్యలకు నిరసన

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మహారాష్ట్ర శివసేన షిండే వర్గం శాసనసభ్యుడు సంజయ్ గైక్వాడ్ పై కఠిన చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గొల్లు కృష్ణ డిమాండ్ చేశారు. ఏపీసీసీ పిలుపు మేరకు పిసిసి ఆదేశాల మేరకు గురువారం మచిలీపట్నం లోని స్థానిక చిలకలపూడి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ పై అనుచిత వ్యాఖ్యలు చేసి యావత్ భారత ప్రజానీకానికి దిగ్భ్రాంతికి గురి చేసిన షిండే పై చట్టపరమైన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని కోరారు. అనంతరం జిల్లా అడిషనల్ ఎస్పీ ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి మువ్వా మోహన్ రావు, మచిలీపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి అబ్దుల్ మతీన్, పెనమలూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి వెలిసిల సుబ్రహ్మణ్యం, పిసిసి డెలిగేట్ కోక ఫణి భూషణ్ పాల్గొన్నారు.

క్షీరబంధు సాయం అందిస్తున్న దృశ్యం

క్షీరబంధు సాయం అందజేత

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటశాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘానికి పాలు పోస్తూ ఇటీవల మరణించిన దిండిగల శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు ప్రవేశ పెట్టిన క్షీర బంధు పథకం ద్వారా 50వేలు ఆర్థిక సహాయాన్ని యూనియన్ పాలకవర్గ సభ్యులు వేమూరి సాయి వెంకటరమణ గురువారం అందించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు గొర్రెపాటి సురేష్ మాట్లాడుతూ ఇప్పటివరకు 5 మంది పాల ఉత్పత్తి దారులు చనిపోగా వారి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి 50వేలు ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. కళ్యాణ మస్తు పథకం కింద ఒక్కొక్కరికి 4 గ్రాముల బంగారం చినట్లు తెలియజేశారు. సంఘ అధ్యక్షులు గొర్రెపాటి సురేష్, మాజీ అధ్యక్షులు గొర్రెపాటి వెంకట నరసింహారావు, సంఘ పాలకవర్గ సభ్యులు దోనేపూడి రామకోటేశ్వరరావు, స్థానిక పంచాయతీ పాలకవర్గ సభ్యులు, టిడిపి నేత పరాత్పరరావు పాల్గొన్నారు.

ఆర్‌కెలో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం, కేతన కొండ ఆర్కే కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో డిపార్ట్మెంట్ ఆఫ్ ఏఐఎంఎల్ అండ్ డిఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 18, 19 తేదీల్లో వర్క్‌షాప్ నిర్వహించడం జరిగింది. ఈ వర్క్ షాప్ యొక్క టైటిల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్‌గా పేర్కొన్నారు. ఏఐఎంఎల్ అండ్ డేటా సైన్స్ హెడ్ ఆఫ్ ద డిపార్ట్మెంట్ షేక్ షబాజ్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. రిసోర్స్ పర్సన్‌గా ఎ.రవితేజ, కె.కావ్య, ప్రిన్సిపల్ డాక్టర్ కొండ్రగుంట రామకృష్ణయ్య మాట్లాడుతూ ఫ్యూచర్ టెక్నాలజీని ఎలా వాడుకలోకి తీసుకురావాలి, మన నిజ జీవితంలోకి ఎలా అమలు చేయాలో తెలియజేయడమే ఈ వర్క్ షాప్ యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. ఇలాంటి వర్క్ షాప్స్ మరెన్నో ఆర్కే కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో జరుగుతూ ఉంటాయని వాటిని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.సాయిరాం, డిపార్ట్మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ కె కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం : వసంత

ప్రజాశక్తి-మైలవరం: మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని స్థానిక శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. జి కొండూరు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను గురువారం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు ఒకటే కాదు క్రీడలు కూడా ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలుగులోకి తీసుకొచ్చేందుకు ఈ క్రీడా పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు.

వరద బాధితులకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఇటీవల వచ్చిన వరదలు కారణంగా బూదవాడ గ్రామంలో ఇబ్బంది పడుతున్న పేద మహిళలకు జగ్గయ్యపేట ఆంధ్రప్రదేశ్ ఎన్జీవో సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో గురువారం చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి బొల్లేపల్లి ఉషారాణి, వనజాక్షి సారథ్యం వహించగా జగ్గయ్యపేట ఉపాధ్యాయమిత్ర సేవా సమితి తనవంతు బాధ్యతగా వారికి సహకారం అందించింది. జగ్గయ్యపేట ఏపీ ఎన్జీవో యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రావు, బాబూరావు పశ్చిమ కృష్ణ సంఘ ఉపాధ్యక్షులు రాటకొండ శ్రీను, కంచికచర్ల యూనిట్ అధ్యక్షులు శివారెడ్డి సహాయ సహకారాలతో చీరలు పంపిణీ చేశారు.

ఎపిఓఎస్ఎస్ కోర్సుల గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఎపిఓఎస్ ఎస్) 2024-25 విద్యా సంవత్సరానికి ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో ఉన్న డాక్టర్ జాకీర్ హుస్సేన్ జూనియర్ కళాశాలకు స్టడీ సెంటర్‌ను అనుమతి మంజూరు చేయడం జరిగిందని జాకీర్ హుస్సేన్ కళాశాల కోఆర్డినేటర్ డాక్టర్ అబ్దుల్ ముజీబ్ పాషా తెలిపారు. ఈ సందర్భంగా ఏపీఓఎస్ఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ పి రవీంద్రనాథ్, జిల్లా ఏపీఓఎస్ఎస్ కోఆర్డినేటర్ నక్క బాబురావు కళాశాలను పరిశీలించారు. అనంతరం ఏపీఓఎస్ఎస్ కోర్సులకు సంబంధించిన గోడపత్రిక ఆవిష్కరించారు. కళాశాల కోఆర్డినేటర్ అబ్దుల్ ముజీబ్ పాష మాట్లాడుతూ ఏపీఓఎస్ఎస్‌కు సంబంధించిన కోర్సులలో ముఖ్యంగా 10వ తరగతి ఇంటర్మీడియట్ కోర్సులలో చేరే విద్యార్థులు అందరూ కళాశాల కోఆర్డినేటర్ అబ్దుల్ ముజీబ్ పాషా, ఫోన్ నెంబర్ 8309554604ను సంప్రదించాలని కోరారు.

డ్వాక్రా మహిళల చేయూత

ప్రజాశక్తి-నందిగామ: విజయవాడ వరద బాధితుల సహాయార్థం చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామ డ్వాక్రా సంఘాల మహిళలు సేకరించిన మొత్తాన్ని నందిగామలో గురువారం ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు అందజేశారు. రూ.60 వేల రూపాయలను ముఖ్యమంత్రి సహాయనిధికి చెక్ రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ విపత్తు సమయంలో ఏడుపదుల వయస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు చూపించిన చొరవ, సమయస్ఫూర్తి అద్భుతమని ప్రశంసించారు.

ఆటో కార్మికుల్ని ఆదుకోవాలని ధర్నా

ప్రజాశక్తి-విజయవాడ: వరదల్లో దెబ్బతిన్న ప్రతి ఆటోకు రూ.25 వేలు ప్రభుత్వం సహాయం అందించాలని కోరుతూ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు), ఐఎఫ్‌టియు, ఎఐసిటియు ఆటో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం ధర్నా చౌక్‌లో ధర్నా జరిగింది. వరదల్లో సర్వస్వం కోల్పోయిన ఆటో కార్మికులను అన్ని విధాలుగా ఆదుకోవాలని, నిబంధనలు సడలించి, ప్రతి ఆటో కార్మికుడికి పరిహారాన్ని అందజేయాలని, ఫైనాన్సర్ల బెడద నుంచి కాపాడాలని కోరుతూ ఆటో కార్మికులు చేసిన నినాదాలు హోరెత్తాయి. నగర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆటో కార్మికులు పాల్గొన్న ఈ ధర్నా కార్యక్రమానుద్దేశించి దుర్గారావు మాట్లాడారు. వరదల్లో ఆటో కార్మికులు అనేక రూపాల్లో నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఆటోకు రూ. 25 వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.వరదల్లో వేలాది ఆటోలు నీట మునిగిపోయాయని, భారీ రిపేర్లకు గురయ్యాయని అన్నారు. నెలరోజులు పాటు వారంతా ఉపాధి కోల్పోయారని అన్నారు. ఆధునికమైన ఆటోల రిపేర్లకు సర్వీస్ కంపెనీలు రూ. నలభై వేల నుండి లక్షా పది వేల వరకు అంచనా వేస్తున్నాయని, పాత మోడల్, పాత ఆటోలకు ఎక్కువమంది థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ లు తీసుకున్నందున ఆటో కార్మికులకు నయా పైసా ఇన్సూరెన్స్ వర్తింప చేయడంలేదని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇన్సూరెన్స్ కంపెనీలను ఆదేశించినా ఇన్సూరెన్స్ కంపెనీలు మాయ చేసి, మోసం చేస్తున్నాయని అన్నారు. రూ.ఆరు వేలు లేదా ఏడు వేలు కాదంటే పది వేల రూపాయల చొప్పున వన్ టైం సెటిల్మెంట్ చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. అలాగే ఇన్సూరెన్స్‌కి క్లెయిమ్ చేయాలంటే నెల రోజులకు పైగా ఆటోను సర్వీస్ కంపెనీలో ఉంచాల్సి ఉంటుందని బెదిరిస్తున్నారన్నారు.తాము ఇచ్చింది తీసుకొని పొమ్మని పలు కంపెనీల యాజమాన్యం మాట్లాడుతున్నారని అన్నారు. ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఈ పరిస్థితిని చక్కదిద్దాలని ప్రయత్నం చేశారని కానీ సాధ్యం కాలేదన్నారు. సర్వీస్ కంపెనీలు బయట నుండి మెకానిక్ లను, ఎక్విప్ మెంటును రప్పించి వేగవంతంగా రిపేర్లు చేయాలని కమీషనర్ ఆదేశించినా పరిస్థితుల్లో మార్పు లేదన్నారు. అదేవిధంగా సర్వీస్ కంపెనీలు స్పేర్ పార్ట్ లపై వచ్చే 25 శాతం లాభాలను వదులుకోవాలని అధికారులు చెప్పినా సర్వీస్ కంపెనీల నుండి స్పందన కానరావడం లేదని అన్నారు. ఐ ఎఫ్ టీ యూ అనుబంధ ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం నగర అధ్యక్షులు దాది శ్రీనివాసరావు మాట్లాడుతూ... వరదల్లో ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందుల్లో ఉంటే... అక్కడక్కడ బ్యాంకు, ఫైనాన్స్ కంపెనీల రికవరీ ఏజెంట్ల ఆగడాలు మొదలయ్యాయని అన్నారు. లోన్ల వాయిదాలు కట్టలేదని ఆటోలను తీసుకెళ్లామని బెదిరిస్తున్నారని, ఈ పరిస్థితులన్నింటిని చక్కదిద్దాలని కోరారు. వరదలో మునిగిపోయిన ప్రతి ఆటో కి రిపేర్లకు ఫుల్ ఇన్సూరెన్స్ ఉన్నా, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ఉన్నా ఇన్యూరెన్స్ వర్తింప చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు నాయకులు కె.పోలారి, ముని శంకర్, ఏ రవిచంద్ర, సిహెచ్ పెద్దిరాజు, సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు ఎం హనుమంతరావు, కె దుర్గావలి, బి రూబెన్ కుమార్, జి ప్రీనివాసరావు, రాఘవ, ఎఐసీసీటియు నాయకులు ఈశ్వర్ పాల్గొన్నారు.

విజయవాడ ధర్నాచౌక్‌లో ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

24 నుంచి మండల స్థాయి ఆటల పోటీలు

ప్రజాశక్తి-తిరువూరు: ఈ నెల 24, 25 తేదీలలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తిరువూరు మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారులు ఏ శ్యాంసుందర్, సిహెచ్ రామకృష్ణ తెలిపారు. గురువారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన తిరువూరు మండల వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్ జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్ 14, అండర్ 17 మం డలస్థాయి ఆటల పోటీలతో పాటు క్రీడాకారుల జట్ల ఎంపిక కూడా జరుగుతుందని తెలియజేశారు. ఈనెల 24న బాలికల విభాగంలో తిరువూరు జిల్లా పరిషత్ బాలికో న్నత పాఠశాలలో, బాలురకు 25న తిరువూరు గ్రీన్ ఇండియా స్కూల్ లో జరుగుతాయని ఎంఈఓ లు పేర్కొన్నారు. అండర్ 14లో పాల్గొనే క్రీడా కారులు 2011 జనవరి తర్వాత పుట్టి ఉండాలని, కబడ్డీ క్రీడాకా రులు బాలికలు 45 కేజీలు, బాలురు 51 కేజీలు మాత్రం ఉండాలని, అండర్ 17 లో పాల్గొనే క్రీడాకారులు 2008 జనవరి ఒకటి తర్వాత పుట్టి ఉండాలని వివరించారు. కబడ్డీ క్రీడాకారులు 55 కేజీలు ఉండాలని, ఆటల పోటీల నిర్వహణపై ఏమైనా సందేహాలు ఉంటే మండల తిరు వూరు మండల కో ఆర్డినేటర్ రజిని, సెల్ నెంబర్ 63008 446426 కి ఫోన్ చేసి తెలుసుకోవచ్చునని తెలిపారు.

మంత్రివర్గ తీర్మానంపై హర్షం

ప్రజాశక్తి-కంచికచర్ల: రాష్ట్రంలో చట్టసభలలో వెనుకబడిన కులాలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని మంత్రివర్గ సమావేశంలో తీర్మానం చేయటం పట్ల టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి అల్లడి కోటేశ్వరరావు గురువారం హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే కేబినెట్ సమావేశంలో తీర్మానం చేయటానికి కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా స్పందించి బీసీలకు చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు.

పత్తి రైతులకు అవగాహన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: డాక్టర్ కెఎల్ రావు కృషి విజ్ఞాన కేంద్రం, గరికపాడు ప్రోగ్రాం కోఆర్డినేటర్, బేయర్ క్రాప్ సైన్సెస్ ఆధ్వర్యంలో పత్తి పంటలో గులాబీ రంగు పురుగు యాజమాన్యంపై అవగాహన, శిక్షణ కార్యక్రమం గురువారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్.ఎస్.కృష్ణంరాజు మాట్లాడుతూ పత్తి పంటలు లింగాకర్షణ బుట్టలు ఎకరానికి ఐదు చొప్పున వేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. సస్యరక్షణ విభాగ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్. రాజశేఖర్ మాట్లాడుతూ 40 రోజులు నుంచి గులాబీ రంగు పురుగు ఉధృతి గమనించిన తరువాత దాని నివారణకు తీసుకోవాల్సినటువంటి తగు జాగ్రత్తలను సూచించడం జరిగింది. ప్రతిలో దశలవారీగా తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలు సూచించారు. ఈ కార్యక్రమంలో బేయర్ కంపెనీ కంపెనీ రీజినల్ మేనేజర్ జె.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

వరద తొలగింపునకు చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఇటీవల వచ్చిన వర్షాలు, వరదల వల్ల మండలంలోని జయంతిపురం ఎస్సీ కాలనీలో మోకాళ్ల లోతు నీళ్లలో బాధితులు ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే ఆ నీటిని తొలగింపు చర్యలు చేపట్టాలని సిపిఎం సీనియర్ నాయకులు కోట కృష్ణ అన్నారు. పట్టణంలోని తాహసిల్దార్ కార్యాలయంలో గురువారం వరద నీరు తొలగించి బాధితులను ఆదుకోవాలని కోరుతూ తాహసిల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ గతంలో ఎప్పుడు లేని విధంగా వరదల వల్ల ఎస్సీ కాలనీలో వరద నీటితో ఇబ్బందులు పడుతున్నారని వరద నీటికి తోడు ఫ్యాక్టరీల నుండి వచ్చే కెమికల్ నీరు ఈ వరద నీటిలో కలవడం వల్ల బాధితులకు చర్మవ్యాధులు, జ్వరాలు, కాళ్ల పాయటం వంటివి జరుగుతున్నాయని తక్షణమే స్పందించి యుద్ధ ప్రాతిపదికన వరద నీరు తొలగింపు చర్యలు చేపట్టాలని వరద నీరు భవిష్యత్తులో రాకుండా శాశ్వత ప్రాతిపదికన చెరువుకు ఆనకట్ట కట్టాలన్నారు. బాధితులకు ఇంకా అందాల్సిన నిత్యావసర వస్తువులు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జె.వెంకటరావు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

వంతెనపై గుంతలు

ప్రజాశక్తి-వత్సవాయి

మండలంలోని సింగవరం గ్రామంలో గ్రామ ప్రవేశం ముందు బ్రిడ్జి దగ్గర ఇటీవల కురిసిన వర్షాలకు గొయ్యిపడి కొట్టుకుపోయింది. దీంతో ఇడ్జీ పక్కన గుంట దగ్గరకు వచ్చేంతవరకు కూడా కనిపించకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. ఉదయం సాయంత్రం సమయంలో స్కూల్ పిల్లలు బస్సుల్లోనూ, ఆటోలోనూ వస్తున్నారు. దీంతో వాహనాలు సైతం కూడా మలుపు వద్దకు రాగానే గుంత కనిపించడంతో అయోమయానికి గురవుతున్నారు. ఈ రహదారి వత్సవాయి, బోనకల్లు, ఖమ్మం, చిట్యాల నుంచి పెనుగంచిప్రోలు వెళ్లాలంటే ఈ రహదారి అతి దగ్గరగా ఉండటంతో ఎక్కువ ప్రయాణికులు ఏ రహదారి గుండా ప్రయాణిస్తున్నారు. అధికారులు స్పందించి ఈ గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.

పత్తికి తెగులు బెడద

ప్రజాశక్తి-వత్సవాయి: ఇటీవల కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పత్తి పొలాలు వైరస్ తెగులుతో ఎర్రబారాయి. ఎన్ని మందులు కొట్టినా ప్రయోజనం లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. మండలంలో సుమారు 500 ఎకరాల్లోని పత్తి పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు పేర్కొంటున్నారు. పిందె కాయ దశలో ఉన్న పత్తి పొలాలు ఎరుపు రంగు రావడంతో ఎదుగుదల లోపించి పిందె రాలిపోతుందని దిగుబడి కూడా తగ్గిపోతుందని రైతులు వాపోతున్నారు.

మట్టి తవ్విన దృశ్యం

పోలవరం మట్టి మాయం

- రాత్రివేళల్లో గుట్టుచప్పుడు కాకుండా తవ్వకాలు
- అధికారుల చర్యలు శూన్యం
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు రైతులు సన్నద్ధం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం తెంపల్లి, బల్లిపర్రు పోలవరం గట్టు మట్టి లేకుండా పోతోంది. అక్రమ తవ్వకాలకు అడ్డే ఉండడం లేదు. రాత్రి వేళలో తవ్వకాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. అక్రమ సంపాదనకు అలవాటు పడిన కొంతమంది పొక్లెయిన్ యజమానులు మట్టి తవ్వి ఇటుక బట్టీలకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని విమర్శిస్తున్నారు. అలాగే ఖాళీ స్థలాలకు తోలేస్తున్నారు. రైతులు అడిగిన పొరదు మట్టి వేయడం లేదని చెప్తున్నారు. మట్టి కొందరికి కాసుల వర్షం కురిపిస్తుందని, అధికారుల అండదండలతో ఈ అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా చేస్తున్నారని స్థానిక రైతులు చెబుతున్నారు. గత కొన్ని రోజులుగా ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి వేళలో తవ్వకాలు చేశారు.

రాత్రివేళల్లో పొక్లెయిన్ పెట్టి మట్టి తవ్వేస్తున్నారు. పగటిపూట యంత్రం తీసుకెళ్లి పక్కనే తోటల్లో పెట్టేస్తున్నారు. ఈ తవ్వకాలకు అనుమతులు లేవని పోలవరం అధికారులు చెబుతున్నా గాని మట్టి యథేచ్ఛగా తరలిపోతుంటే చర్యలు తీసుకునే నాథుడే కరువయ్యాడు. అదేమని సంబంధిత అధికారులను ప్రశ్నిస్తే మట్టి దొంగలను సమర్థిస్తూ వారిని వెనకేసుకురావడం కొసమెరుపు. శాఖాపరమైన అనుమతులు లేవు. అదేమంటే ఓ నేత పేరు చెప్పుకొని ఈ దందాకు పాల్పడుతున్నారని గ్రామానికి చెందిన రైతులు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

మట్టి దొంగలకు ప్రభుత్వమే దారులు తెరిచినట్టుగా ఈ వ్యవహారం ఉందని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామంలో ఉన్న ఇటుక బట్టీలను తరలించి ఎకరాల్లో మేటలు వేస్తున్నారు. ఇది సీజన్ కావడంతో ఇటుక బట్టీల నిర్వాహకులు మట్టిని కొనుగోలు చేసి పెద్ద కొండలుగా నిలువ చేసుకుంటున్నారు. విడతల వారీగా మట్టిని మాయం చేస్తున్నారు. మట్టిని అమ్ముకుని సొమ్ము చేసుకున్న వ్యక్తులు జల్సాగా తిరుగుతున్నారని అంటున్నారు. మట్టి తవ్వకం దారులు గ్రామాల పరిధిలోని అధికారులను మేనేజ్ చేసుకుంటున్నారని విమర్శ ఉంది. వారికి మామూళ్లు ఇచ్చి దర్జాగా మట్టి కొట్టేస్తున్నారు. ఈ విషయమై ఓ గ్రామస్థాయి అధికారికి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. ఇంకో అధికారిని అడిగితే అనుమతుల గురించి మాకు ఏం తెలియదు అన్నట్టు మాట్లాడారు. తవ్వకందారు అధికారులను గుప్పెట్లో పెట్టుకుని అక్రమాలను ప్రోత్సహిస్తున్నాడనే వాదన ఉంది. ఇప్పటికైనా ఈ మట్టి దొంగలపై చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు. ఈ అక్రమ తవ్వకాలపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయడానికి రైతులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఆత్కూరు పోలీసులు రైడ్ చేసి ట్రాక్టర్లను పట్టుకోవడం గమనార్హం. అయితే తవ్వకాలు ఆగుతాయా అన్నది మాత్రం అనుమానం.

రాష్ట్ర స్థాయి త్రో బాల్ పోటీలకు ఎంపిక

కీర్తి

రితిక

ప్రజాశక్తి-గన్నవరం : రాష్ట్ర స్థాయి త్రో బాల్ (అండర్ -19) పోటీలకు కృష్ణా జిల్లా, నియోజక కేంద్రమైన గన్నవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం యమ్. పి.సి విద్యార్థినులు మాతంగి రితిక, పుట్టా కీర్తి ఎంపికైనట్లు కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ పి.ఉమాదేవి గురువారం పత్రికలకు గురువారం తెలిపారు. విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం లో జరిగిన జిల్లా స్థాయి ఎంపికలకు హాజరై అసమాన క్రీడానైపుణ్యం ప్రదర్శించడంతో సెలక్షన్ కమిటీ రితిక, కీర్తి లను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఉమాదేవి తెలిపారు. ఈ నెల 21,22 తేదీలలో విశాఖపట్నం లో జరుగబోయే ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల అండర్-19 బాల, బాలికల త్రో బాల్ పోటీలలో కృష్ణా జిల్లా నుండి రితిక, కీర్తి ప్రాతినిధ్యం వహిస్తారని ఉమాదేవి తెలిపారు. చక్కటి క్రీడా ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన రితిక, కీర్తి లను ఈ క్రీడాకారిణి కి ఉత్తమ శిక్షణ ఇచ్చి ప్రోత్సహం చిన వ్యాయామ విద్య ఉపాధ్యాయులు ధనియాల నాగరాజు షేక్ మీరా సాహెబ్ ను ఉమా దేవి తో పాటు కళాశాల (హైస్కూల్ ప్లస్)ఉపాధ్యాయ, ఉపాధ్యేతర సిబ్బంది అభినందించారు.

సిపిఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వంగర్ శేషగిరిరావు

సిపిఆర్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సిపిఆర్‌పై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ రాజనాల అంకారావు అధ్యక్షతన రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ ఏ వీర కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు వంగర శేషగిరిరావు పాల్గొని సిపిఆర్‌పై అవగాహన కల్పించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సిపిఆర్ పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. డిఆర్ఏబిసి ఫార్ములాని ఉపయోగించి సిపిఆర్ చేయాలని చెప్పారు. ద్వారా మరణం చేరువకు చేరిన వ్యక్తికి పునర్జన్మ ఇవ్వవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

ప్రజాశక్తి-కంకిపాడు : సిపిఎం తాడిగడప మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ గురువారం జరిగింది. ఈ సభకు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వై నరసింహారావు హాజరై మాట్లాడుతూ ఏచూరి ముక్కుసూటిగా మాట్లాడే వ్యక్తి అని, ఆయన మరణం సిపిఎంకు తీరని లోటని అన్నారు. ఆయన పార్లమెంట్లో 294 ప్రసంగాలు చేసి 90 శాతం హాజరున్న ఎంపీగా గుర్తింపు పొందారన్నారు. ఆయన చూపిన బాటలో నడిచి ఆయన ఆశయాలు సాధన కృషి చేయాలని అదే ఆయనకి నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి త్రిమూర్తులు, కాసిం, మస్తాన్వలి యుటిఎఫ్ నాయకులు షేక్ షరీఫ్, మహిళా సంఘం మండల కార్యదర్శి పాతాల లక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వై. నరసింహారావు

ఐటిఐలో 4వ విడత కౌన్సెలింగ్ ప్రారంభం

ప్రజాశక్తి - గుడివాడ : 2024-25 విద్యా సంవత్సరానికి ఐటిఐ కోర్సులలో చేరడానికి 4వ విడత అడ్మిషన్స్ పొందడానికి కృష్ణాజిల్లాలో గల ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐ కళాశాలల్లో మిగిలియున్న సీట్లను భర్తీ చేయడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎల్ గౌరిమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26వ తేదీలోపు ఐటిఐ.ఎపి.జివోవి.ఇన్ ద్వారా తమ దరఖాస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఈనెల 28వ తేదీన ప్రభుత్వ ఐటిఐలో, 30వ తేదీన ప్రైవేటు ఐటిఐలో కౌన్సెలింగ్ కు హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నెం.08674- 295953, 8555952320, 82975774757, 99851 62555 నెంబర్లకు సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని 10వ తరగతి, 8వ తరగతి పాస్ అయిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గౌరిమణి తెలిపారు.

విరాళాలు సేకరిస్తున్న దృశ్యం

వరద బాధితులకు విరాళాలు సేకరణ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : వరద బాధితుల సహాయార్థం ప్రతి ఒక్కరు విరాళాలు అందించాలని హై5 యూత్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ గోట్రు నాగబాబు కోరారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రమైన గుడ్లవల్లేరు బస్టాండ్ సెంటర్లోని వ్యాపారస్తుల నుండి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హై5 యూత్ ఫౌండేషన్ తరఫున సర్వం కోల్పోయిన వరద బాధితుల కుటుంబాలకు తమ వంతుగా దాతల సహకారాలతో గత కొన్ని రోజుల నుండి సుమారుగా 5,000 పైబలుక భోజన ప్యాకెట్లు, వాటర్ బాటిళ్ల , బిస్కెట్ ప్యాకెట్లు అందించామన్నారు. సర్వం కోల్పోయిన బాధితులకు సహాయార్థంగా నిత్యావసర వస్తువులు అందించాలని ఉద్దేశంతో బస్టాండ్ సెంటర్లోని సహాయార్థ శిబిరాన్ని ఏర్పాటు చేసి క్యూఆర్ కోడ్ స్కానర్ ని ఏర్పాటు చేశామని, సహాయ సహకారాలు గూగుల్ పే, ఫోన్ పే ద్వారా కూడా తమ విరాళాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హై5 యూత్ ఫౌండేషన్ సెక్రటరీ కళివరపు రంగారావు, హై5 యూత్ ఫౌండేషన్ సభ్యులు ప్రత్తిపాటి రవి , నూకతోటి నాగరాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏలూరు కాల్వ గండ్లు పూడ్చాలని ఆందోళన

ప్రజాశక్తి-గన్నవరం : యుద్ధ ప్రాతిపదికన ఏలూరు కాలువగండ్లు పూడ్చాలని రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో గురువారం బుద్ధవరంలోని ఆర్‌బికే కేంద్రం దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో రైతు సంఘం గన్నవరం మండల కార్యదర్శి సూరగని సాంబశివరావు, రైతు సంఘం నాయకులు నక్క రామయ్య, నక్క వెంకటరామయ్య, ఆదిశేషు వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, గండికోట దశరథరామయ్య, సిఐటియు నాయకులు బడుగు మరియదాసు తదితరులు పాల్గొన్నారు. ఏలూరు కాల్వగండ్లను వెంటనే పూడ్చాలని అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఇప్పటికే రైతాంగం వరదల వల్ల కృష్ణాజిల్లాలో ఏలూరు కాల్వ వేల ఎకరాలు పంట దెబ్బతిందన్నారు. ఉన్న పంటను కూడా కాపాడు కోవాలంటే ప్రభుత్వం వెంటనే స్పందించి కాలువగండ్లను పూడ్చి, కాలువలకు నీళ్ల వదిలి పంటలను కాపాడాలని రైతు,కౌలు రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

ఆందోళన చేస్తున్న రైతులు

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : సెప్టెంబర్ మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా అనేక ఇళ్లు /పాఠశాలలు నీటిలో మునిగి పోవడం వల్ల పుస్తకాలు తడిచిపోయి విద్యార్థులు ఇబ్బందులు పడటంతో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర ద్వారా టెక్స్ట్ బుక్స్, బ్యాగ్, నోట్ బుక్స్, బెల్ట్, యూనిఫామ్స్ ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు అందించినట్లు సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె. రాములునాయక్ గురువారం తెలిపారు. అవనిగడ్డ, చల్లపల్లి, మోపిదేవి, గుడ్లవల్లేరు, ఉంగుటూరు, తోట్లవల్లూరు, పెనమలూరు మండలాల్లోని వరద ప్రభావిత గ్రామాల్లోని విద్యార్థులకు అందించినట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు యోగ ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ మండలం మునగచర్ల గ్రామంలో మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనివర్సల్ యోగ సెంటర్ యోగా గురూజీ గాడి పర్తి సీతారామారావు ఆధ్వర్యంలో ఉచితంగా యోగా క్లాసులు నిర్వహించారు.ఈ సందర్భంగా యోగా గురూజీ సీతారాం మాట్లాడుతూ యోగా అభ్యాసం విద్యార్థుల జీవితాలను ఎలా సానుకూలంగా ప్రభావితం చేస్తుందో తెలుసుకోవాలన్నారు. మానసిక స్పష్టతను పెంచడం నుండి శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించడం వరకు, యోగా విద్యార్థులకు అనేక రకాల ప్రయోజనాలను అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లి సమస్యలపై మంత్రికి వినతి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణను మైలవరం శాసనసభ్యులు వసంత వెంకటకృష్ణప్రసాదు గురువారం అమరావతి సచివాలయంలోని ఆయన చాంబర్లో ప్రత్యేకంగా

కలిశారు. కొండపల్లి మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులు, సిబ్బంది కొరత, నిధులు మంజూరు గురించి ప్రత్యేకంగా వినతిపత్రం సమర్పించారు. సుమారు లక్ష మంది జనాభా నివసించే కొండపల్లి మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి నారాయణ అతి త్వరలోనే ఆయా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ముందుగా మంత్రి నారాయణకి శాలువా కప్పి సత్కరించి, కొండపల్లి బొమ్మను బహుకరించారు.

అంతరిక్ష పరిశోధనలపై అవగాహన

ప్రజాశక్తి-వీరులపాడు: వీరులపాడు మండలం పొన్నవరం ఏకత్వ సీబీఎస్‌ఇ పాఠశాలలో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో, విభ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అంతరిక్ష పరిశోధనలు, ఉపగ్రహ నమూనాలు తదితర అంశాలపై పాఠశాల విద్యార్థులకు అవగాహన

కల్పించేందుకు చేపట్టిన స్పేస్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని వీరులపాడు మండల విద్యాశాఖాధికారి పాల్ కెనడీ గురువారం ప్రారంభించారు. విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక రంగాలపై అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఆయా రంగాలలో అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ అమరనేని రమేష్, డైరెక్టర్లు అమరనేని మనోజ్, అమరనేని సింధూర, ప్రిన్సిపాల్ ఏఎన్ సూర్యావతి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి-తిరువూరు: సాయిబాబా గుడి వెనకాల ఉన్న ఎస్టీ కాలనీలో పారిశుద్ధ్య పనులను మెరుగుపరచాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. కాలనీలోని కాలువలన్నీ పూ డిపోయి దుర్వాస వెదజల్లుతుందని, చెత్తా చెదారం అధికంగా ఉందని చెప్పారు. దీనితో దోమలు వృద్ధి చెందుతున్నాయని, ఇప్పటికే డెంగ్యూ జ్వరంతో ఈ ప్రాంతంలో ఇద్దరు చనిపోయినా నగర పంచాయతీ పాలకవర్గం, శానిటరీ అధికారులు పట్టించుకోకపోవడం చాలా బాధాకరమని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే పారిశు ధ్య పనులు చేయించి ప్రజల ప్రాణాలు కాపాడాలని, లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని సిపిఎం సీనియర్ నాయకులు ఎస్వీ భద్రం, నూకల సత్యనారాయణ, ఎం.నరసింహారావు హెచ్చరించారు.

అమెజాన్ ఫుల్ ఫిల్‌మెంట్ సెంటర్లు ప్రారంభం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: రానున్న పండుగల సందర్భంగా విస్తృత స్థాయిలో వినియోగదారులకు సేవలను అందించేందుకు కొత్తగా మూడు ఫుల్ ఫిల్‌మెంట్ సెంటర్లను అమెజాన్ ఆధ్వర్యంలో ప్రారంభించినట్లు సంస్థ ఇన్‌ఛార్జి కె. ఈశ్వర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వీటి ద్వారా వినియోగదారులకు డెలివరీ వేగాని గణనీయంగా పెంచుతాయని తెలిపారు. ముఖ్యంగా వినియోగదారులకు సేవలను అందించడంతో పాటు ఆర్థిక అవసరాలను అందించే విధంగా కూడా ఉంటుందని తెలిపారు. దీనితో పాటుగా కొత్తగా ఎక్కువ మందికి ఉద్యోగ అవకాశాలను కూడా కల్పించేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. పూర్తి సమయంతో పాటుగా పార్ట్ టైమ్ ఉద్యోగ అవకాశాలు కూడా పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

నేటి నుంచి ఇంటింటికీ వెళ్తాం : సౌమ్య

ప్రజాశక్తి-నందిగామ: రాష్ట్రంలో ఎన్డీయే అధికారంలోకి వచ్చి వంద రోజులవుతున్న సందర్భంగా ఈ నెల 20 నుంచి 'ఇది మంచి

ప్రభుత్వం' నినాదంతో మంత్రులు, ఎమ్మెల్యేలు ఆరు రోజుల పాటు ఇంటింటికీ వెళ్లి ప్రజల్ని కలవనున్నట్లు నందిగామ శాసన సభ్యులు తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం తొలి వందరోజుల్లో అమలు చేసిన సంక్షేమ పథకాన్ని, చేపట్టిన ముఖ్యమైన కార్యక్రమాల్ని వారికి వివరిస్తామన్నారు. ఆరు ముఖ్యమైన అంశాలతో కరపత్రాన్ని రూపొందించారని తెలిపారు.

మంత్రిని కలిసిన విద్యుత్ కార్మికులు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పర్వతనేని సాంబశివరావు, డాక్టర్ ఎన్‌టిపిఎస్ రీజియన్ అధ్యక్షులు ఆలపాటి శివనాగేశ్వర రావు ఆదేశాల మేరకు తెలుగునాడు కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు, విద్యుత్ శాఖ మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్‌ను, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసి కార్మికుల సమస్యలపై విజ్ఞాపన పత్రాలు అందజేసి వారితో చర్చించారు. దీనిపై మంత్రులు సానుకూలంగా స్పందించి విద్యుత్ శాఖ వారికి తగ్గిన ఆదేశాలు ఇస్తామని చెప్పినట్లు కార్మిక నాయకులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో తెలుగునాడు కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షులు డి

స్వతంత్ర కుమార్, ప్రధాన కార్యదర్శి మందడపు దుర్గారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకునూరి రత్న శేఖర్, ప్రచార కార్యదర్శి జొన్నలగడ్డ రాజేష్, జానీ షరీఫ్, ఏఎంసి కార్మికుల ప్రతినిధి తమ్మిశెట్టి రామాంజనేయులు ఉన్నారు.

వైద్య శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజారోగ్య పరిరక్షణ దష్ట్యా ముందస్తుగా యుద్ధ ప్రాతిపదికన

చర్యలు చేపట్టినట్లు మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాదు పేర్కొన్నారు. కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపట్నంలో ఎమ్.వి.ఆర్ కళ్యాణ మండపంలో గురజాల లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కోడూరు మనోజ్ కుమార్ (కన్నా) వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాదు గురువారం ప్రారంభించారు. మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), బీజేపీ నియోజకవర్గ ఇంచార్జి నూతులపాటి బాల కోటేశ్వరరావు (బాల) పాల్గొన్నారు. గుండె, ఫిట్స్, వెన్నుముక సమస్యలు, తలనొప్పి, బి.పి. షుగరు, ఇసిజి, ఎత్తు, బరువు, పల్స్, టెంపరేచర్, ఇతర జనరల్ పరీక్షలు చేశారు.

బహిరంగ వేలం వాయిదా

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానానికి కొబ్బరి చిప్పలు పోగు చేసుకొను లైసెన్సు, తులసీ-పూలు అమ్ముకొను లైసెన్సులకు వంశపారంపర్య ధర్మకర్త వి.యల్.ఇందిరాదత్తు ఆధ్వర్యములో నందిగామ దేవాదాయ శాఖ తనిఖీదారు పి ఫణి కుమార్ పర్యవేక్షణలో గురువారం దేవస్థాన కార్యాలయంలో సీల్డు టెండరు-కం-బహిరంగ వేలము పాటలు నిర్వహించారు. ధరావత్తు చెల్లించుటకు ఎవరు ముందుకురాని కారణంగా వేలం పాట వాయిదా వేసినట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారిణి శిరవరపు హేమలతదేవి తెలిపారు.

లాయర్స్ ఫోరం సెక్రటరీగా ఆజాద్

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ ప్రాంతానికి చెందిన సీనియర్ న్యాయవాది ఎస్ఎం కె.ఆజాద్ ఆల్ ఇండియా లాయర్స్ ఫోరం ఆంధ్రప్రదేశ్ స్టేట్ సెక్రటరీగా నియమితులయ్యారు. తనపై నమ్మకం ఉంచి సెక్రెటరీగా నియమించినందుకు నేషనల్ చైర్మన్ వినోద్ కుమార్

గోయల్,స్టేట్ ప్రెసిడెంట్ జల్లీ అనిల్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆజాద్ న్యాయవాదుల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఎజిపిలు మట్ట ప్రసాద్, దర్శి అర్జున్ హైకోర్టు, న్యాయవాది ఎక్కిరాల హనుమంతరావు, కొమ్మినేని మౌళేశ్వరరావు, దగ్గుపాటి కమలాకర్, బొబ్బిలిపాటి భాస్కర్ రావు, గోబేరు శివరామకృష్ణ, అరుణ్ తదితరులు ఆజాద్ ని అభినందించారు.

దుప్పట్లు, వస్త్రాలు పంపిణీ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: వరద బాధితులకు వింగ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఒంగోలు వారి ఆధ్వర్యంలో బాధితులు 200ల కుటుంబాలకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు, చీరలు, వంచలు పంపిణీ చేశారు. ఇబ్రహీంపట్నంలోని గాజుల పేట, భీమరాజు గుట్ట, ప్రసాద్ నగర్ తదితర ప్రాంతాల్లో ముంపు ప్రాంత బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. 20, 22, 24వ డివిజన్‌లలో వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు మేమున్నామంటూ ఒంగోలు నుంచి వచ్చిన వింగ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రెసిడెంట్ చింతపల్లి రామకష్ణ ఆధ్వర్యంలో 24వ డివిజన్ కౌన్సిలర్ పులి అరుణాదాస్‌ల సారథ్యంలో బాధితులకు పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పళ్లం సుబ్బారావు, మేకల శేఖర్, అభి అనపర్తి ప్రదీప్, పులి రామారావు, చింతపల్లి రామకృష్ణ, మల్లికార్జున, ప్రాజెక్ట్ మేనేజర్ గుడివాడ బాబ్జి పాల్గొన్నారు.

పోషకాహార మాసోత్సవాలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని చిల్లకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు జగ్గయ్యపేట పట్టణం రెండవ సెక్టార్ పరిధిలో బాలికల హైస్కూల్‌లో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలికలకు హెచ్.బి టెస్టులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎసిడిపిఓ నాగమణి పిల్లలకు చిరుధాన్యాల, ఆకుకూరలు గురించి మరియు వాళ్ల బలమైన ఆహారం తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. **తిరువూరు:** అంగన్వాడి కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం తీసుకో వడంతో గర్భిణులు, పుట్టబోయే బిడ్డ, బాలింతలు, చిన్నా రులు ఆరోగ్యంగా ఉంటారని తిరువూరు సీడీపీఓ జి. సత్యవతి అన్నారు. ఐసీడీఎస్ తిరువూరు ప్రాజెక్ట్ పరిధి లోని 12, 13, 14, 15 వార్డుల్లో ఎంపీఆర్ స్ట్రీట్, బోయ బజారు, యాదవ బజార్, వడ్డెర బజార్ అంగ న్వాడి కేంద్రాల్లో గురువారం పోషణ మహా మాసోత్సవాల సందర్భంగా పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ ఎన్ రాజేశ్వరి, టాటా ట్రస్ట్ ప్రోగ్రాం అసోసియేటర్ సీ హెచ్ రమేష్, హెల్త్ సెక్రటరీలు పీ రమాదేవి, ఎం సువర్ణరాణి పాల్గొన్నారు. **నందిగామ:** నందిగామ మండలం మునగచర్ల గ్రామంలో అంగన్వాడి కేంద్రాలలో సూపర్వైజర్ గోగినేని వెంకట్రావమ్మ ఆధ్వర్యంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న పిల్లలకు బరువు, ఎత్తు చూసి, గర్భిణీ స్త్రీలకు సీమంతాలు చేసి రక్తహీనత నివారణకు వంద రోజుల ప్రత్యేక పోషణ కార్యక్రమంలో భాగంగా పల్లి చిక్కిలు, రాగి పిండి, సజ్జ పిండి, బెల్లం, ఖర్జూరం తదితర పోషకాహార కిట్లు అందజేశారు. ప్రాథమిక పాఠశాలలో ఏ.యన్.యం.సునీత, ఆశా కార్యకర్తలు కలిసి విద్యార్థులకు హెచ్.బి. పరీక్షలు చేసి ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ గోగినేని వెంకట్రావమ్మ, జలజీవన్ మిషన్ భాగ్యలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు, లక్ష్మీనారాయణ, అంగన్వాడి కార్యకర్తలు జి. నిర్మల, సామ్రాజ్యం, ఎ.యన్.యం.సునీత తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో...

న్యాయసేవకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు న్యాయస్థానాల పరిధిలో న్యాయ సేవకులుగా సేవలు చేసేందుకు పారా లీగల్ వాలంటీర్ల నియామకం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు వాక దాని లక్ష్మీనారాయణ తెలిపారు. ఒక్కొక్క వాలంటీర్‌కు రోజుకు 500 ఇస్తారని చెప్పారు. కోర్టు తరఫున ప్రజల్లోకి వెళ్లి ప్రజాసేవ చేయడమే ఈ వాలంటీర్ల పని అని చెప్పారు. ఆసక్తి కలిగిన 10వ తరగతి చదివి, తెలుగు చదవటం, రాయటం వచ్చిన వారు కోర్టు ప్రాంగణంలో సిబ్బంది అశోక్‌ను సంప్రదించాలని చెప్పారు. ఇతర వివరాలకు 6302481044 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

23 నుంచి ఆటల పోటీలు

ప్రజాశక్తి-విస్సన్నపేట: స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల నందు గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ భాస్కర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పి ఈ టి రమేష్ మాట్లాడుతూ ఈనెల 23, 24 తేదీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నరసాపురం గ్రామంలో ఈ పోటీలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఇతర వివరాలకు 9177867889 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

అగ్నిమాపక అధికారిగా కృష్ణమూర్తి

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల అగ్నిమాపక అధికారిగా పివిఎన్ఎం కృష్ణమూర్తి గురువారం కంచికచర్ల అగ్నిమాపక కేంద్రంలో బాధ్యతలు చేపట్టారు. ఈయన బదిలీపై కంచికచర్లకు వచ్చారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది

ఆయనను సాదరంగా ఆహ్వానించి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

అన్నదానం

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు పట్టణంలోని మధిర రోడ్డు ఇందిరా కాలనీలో ఏర్పాటుచేసిన గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. వినాయక చవితి నుంచి నిత్య పూజలు అందుకుంటున్న మహా గణపతి స్వామిని అధిక సంఖ్య లో యాత్రికులు దర్శించుకున్నారు. దీనిలో భాగంగా గురువారం స్థానిక 15వ వార్డు కౌన్సిలర్ మోదుగు ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వాహక కమిటీ మహా అన్నప్రసాద సంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో తిరువూరు జడ్పిటిసి యరమల రామచంద్రారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు పరసా సత్యనారాయణ, మూడు దుర్గారావు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-విస్సన్నపేట

స్థానిక సిద్ధార్థ విద్యాసంస్థల సౌజన్యంతో నిత్యావసరాలు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల అధినేత మేడ మోహన్‌రావు మాట్లాడుతూ విజయవాడ వరద బాధితులు 160 కుటుంబాలకు రూ.7 లక్షల విలువైన నిత్యావసరాలను తమ సంస్థ తరఫున పంపిణీ చేసినట్లు చెప్పారు. సరుకులను స్థానిక తాసిల్దార్ కె.లక్ష్మీ కళ్యాణి చేతుల మీదుగా అందించినట్లు తెలిపారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై అవగాహన : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఇంటింటికి తిరిగి ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, విద్యుత్ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం అమలులో భాగంగా గహాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్ షాపులు, ఎలక్ట్రికల్ వస్తువుల అమ్మకపు షాపుల నుండి ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించాలని, ఇందుకు కరపత్రాలను ముద్రించి ప్రజలకు అర్థమైన రీతిలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులను ఇంటింటికి పంపించి పనికిరాని కంప్యూటర్లు, లాప్టాప్ లు, టెలివిజన్లు, ఫ్రిజ్లు, ఏసీలు వంటి ఎలక్ట్రానిక్ పరికరాల వ్యర్థాలను సేకరించి ఈ నెల 27వ తేదీ కల్లా జిల్లా కేంద్రానికి చేర్చే విధంగా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల నుంచి సేకరించిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ కోసం సంబంధిత పరిశ్రమకు పంపుతామన్నారు. ఎల్ఈడి, సిఎఫ్ఎల్ బల్బులు ట్యూబ్ లైట్లు, బ్యాటరీలు మినహాయించాలని, నిపుణుల ఆధ్వర్యంలో వాటిని ప్రత్యేకంగా సేకరించి తరలించాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులు పూర్తి చేసుకున్న నేపథ్యంలో రేపటి నుంచి వారం రోజుల పాటు సచివాలయం సిబ్బంది చేత ఇంటింటికి తిరిగి స్టిక్కర్లు, కరపత్రాలను ప్రజలకు అందించే విధంగా ఎంపీడీవోలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ క్రమంలో సచివాలయ సిబ్బంది ఇంటింటిని ఎలాగూ సందర్శిస్తారు గనుక, అదే సమయంలో ప్రజలకు సౌర విద్యుత్ వినియోగం పీఎం సూర్య ఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్ లో డిపిఓ నాగేశ్వర్ నాయక్, ఎన్ఐసి ఏడిఐఓ సెల్వినా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

మొక్కల తోనే ప్రాణులకు భవిష్యత్తు

ప్రజాశక్తి-గంపలగూడెం: ప్రతి వ్యక్తి ఒక మొక్క నాటి భూమిపై జీవించు, ప్రతి ప్రాణికి భవిష్యత్తు నివ్వాలని గంపలగూడెం గ్రామ సర్పంచ్ కోట పుల్లమ్మ కోరారు. స్వచ్ఛతా హి కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్తు ఆవరణలో చెత్తాచెదారాన్ని తొలగించి, పరిశుభ్రం చేశారు. ఉపాధి హామీ కూలీలతో ఆ ప్రాంగణంలో ఉన్న చెట్ల కొమ్మలను తీసివేశారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎంపీడీవో ఎం చెన్నయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈవో అండ్ పి ఆర్ డి సునీల్ ఆంగ్ స్ట్రామ్, ఈవో గోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎల్డిసి వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జెసి గీతాంజలి శర్మ

స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 కార్యాచరణపై సమీక్ష

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 డాక్యుమెంట్ తయారీపై గురువారం ఉదయం అమరావతి రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో కలెక్టరేట్ లోని వీసీ హాల్ నుంచి జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ పాల్గొన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 లక్ష్యంలో భాగంగా రాబోయే ఐదేళ్లకు జిల్లా ఏ విధంగా ఉండాలో కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని కలెక్టర్లకు సూచించారు. ప్రాథమిక రంగంలో వ్యవసాయం, అటవీ, పశుపోషణ, ఆక్వాకల్చర్, కోళ్ల పెంపకం, మైనింగ్.. ద్వితీయ రంగంలో క్వారీయింగ్, తయారీ.. అదేవిధంగా తతీయ రంగంలో వాణిజ్యం, రవాణా, కమ్యూనికేషన్, బ్యాంకింగ్, విద్య, ఆరోగ్యం, పర్యాటకం, సేవలు, బీమా మొదలైన అంశాల ఆధారంగా డాక్యుమెంట్ తయారు చేయాలని ఆయన జిల్లా కలెక్టర్లకు సూచించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్ లో డ్వామా పీడీ జీవి సూర్యనారాయణ, సిపిఓ గణేష్ కష్ణ, జెడ్పి సీఈవో ఆనంద్ కుమార్, డీఎం అండ్ హెచ్వో డాక్టర్ జి గీతాబాయి, పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న కలెక్టర్, తదితరులు

24 నుండి 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : కృష్ణా జిల్లాలో సెప్టెంబర్ 24 వ తేదీ నుండి పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రారంభిస్తామని జిల్లా కలెక్టర్ డికె బాలాజీ తెలిపారు. గురువారం కలక్టర్ ఛాంబర్లో పొలం పిలుస్తోంది కార్యక్రమ గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం కలక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం లో భాగంగా వారానికి 2 రోజులు వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు శాస్త్రవేత్తలు, ప్రజా ప్రతినిధులతో గ్రామాలలో క్షేత్ర సందర్శన మరియు చర్చ గోష్టి నిర్వహిస్తామన్నారు. ప్రతి మంగళ, బుధవారంలలో ముందస్తు గా తయారుచేసిన షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాలను సందర్శిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు చేపట్టవలసిన, అనుసరించవలసిన మేలైన యాజమాన్య పద్ధతులను ఆయా శాఖల అధికారులు రైతులకు తెలియ జేస్తారన్నారు. రైతు సోదరులు పొలం పిలుస్తోంది. కార్యక్రమంలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంయుక్త వ్యవసాయ సంచాలకులు ఎన్. పద్మావతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని తొమ్మిదవ వార్డులో గణపతి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం చవితి పందిట్లో గణనాధునికి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయ కులు, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్ రామ్ పాల్గొని గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ పెద్దలు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు పరుచూరి దుర్గాప్రసాద్, జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాడ శేషుబాబు, ఉపాధ్యక్షులు తుంగల నరేష్, ఓటమి నాయకులు సింహాద్రి పవన్, అడపా శ్రీనివాసరావు కమ్మిలి సాయి భార్గవ పాల్గొన్నారు.

ఉత్సవాల్లో పాల్గొన్న మండలి జయరాం

కెబిఎన్ అధ్యాపకురాలు శైలజకు డాక్టరేట్

ప్రజాశక్తి-వన్‌టౌన్ : కాకరపర్తి భావనారాయణ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకురాలు ఓ శైజలకు కష్ణా విశ్వవిద్యాలయం రసాయన శాస్త్రంలో డాక్టరేట్‌ను ప్రకటించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ. కష్ణవేణి తెలిపారు. ఆహార నమూనాల పరిశీలనకు సంబంధించి రసాయనశాస్త్రంలో నూతన అంశాలను వివరించటంపై సమర్పించిన పరిశోధన పత్రానికి కష్ణా విశ్వవిద్యాలయం ఈ డాక్టరేట్‌ను ప్రకటించినట్లు పేర్కొన్నారు. రసాయన శాస్త్ర సీనియర్ అధ్యాపకురాలు డాక్టర్ ఎం. మనోరంజని సారథ్యంలో ఈ పరిశోధనా పత్రాన్ని సమర్పించినట్లు తెలి పారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, హిందూ హైస్కూల్స్ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వీ. నారాయణరావులు శైలజను అభినందించినట్లు ఆమె పేర్కొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ బోడే ప్రసాద్

చెట్ల ఉపయోగాలపై అవగాహన

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలం ఈడుపుగల్లు గ్రామంలోని జెడ్‌పిహెచ్ స్కూల్‌లో వన మహోత్సవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెనమలూరు శాసనసభ్యులు బోడే ప్రసాద్ హాజరై వనమహోత్సవం గురించి విద్యార్థులకు అవగాహన కలిగించి చెట్లు నాటడం వల్ల ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జనసేన సమన్వయకర్త ముప్పా రాజా, ఎంపిపి నెరుసు రాజ్యలక్ష్మి, మాజీ ఎంపిపి దేవినేని రాజా, కంకిపాడు మండల పార్టీ అధ్యక్షులు సూదిమళ్ళ రవీంద్ర, ఈడుపుగల్లు సర్పంచ్ పందిపాటి ఇందిరా, స్కూల్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

ఫాగింగ్ యంత్రాలు అందజేత

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : గ్రామపంచాయతీలో వినియోగం కోసం ఫాగింగ్ యంత్రాలను సిఎస్ఆర్ నిధులతో ఉచితంగా అందజేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. గురువారం నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధులు ఎస్ ఆర్ నిధులతో 10 ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేసి గ్రామపంచాయతీల్లో వినియోగం కోసం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర నాయక్ కు ఉచితంగా అందజేశారు.

వరద బాధితులకు నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి - భవానీపురం : అఖిలభారత చాత్తాద శ్రీవైష్ణవ సమాఖ్య. హైదరాబాద్ అధ్యక్షులు శ్రీమాన్ తిరుప్పాళ్ళూరి రామానుజన్, ఉపాధ్యక్షులు శ్రీమాన్ సుదర్శన వెంకటేశ్వర్లు కమిటీ ఆధ్వర్యంలో గురువారం విజయవాడ వరద బాధిత ప్రాంతాల్లోని చాత్తాద శ్రీవైష్ణవులకు భవానీపురం శ్రీ సాయి అన్న గార్డెన్ నందు 150 మంది వరద బాధితులకు ఒక నెలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులు, దుప్పట్లు సమైక్య నాయకులచే పంపిణీ చేశారు. అఖిల భారత చాత్తాద శ్రీవైష్ణవ సమాఖ్య నాయకులు ఏపీ సెక్రటరీ మధు రాంతకం శ్రీనివాసరావు, ఎస్పీ శేషగిరిరావు, పొట్లూరి వెంకటేశ్వరరావు, డాక్టర్ పి. విజయలక్ష్మి, కంటాయిపాలెం ఓం ప్రకాష్, టి.లక్ష్మయ్య పాల్గొన్నారు.

సిపిఎం అభిమాని మృతి

ప్రజాశక్తి - భవానీపురం : సిపిఎం అభిమాని వి.రాజశేఖర్ అనారోగ్యంతో భవానీపురంలోని ఓ ఆస్పత్రిలో గురువారం మరణించారు. 43వ డివిజన్ ఊర్మిళా నగర్‌లో వారి ఇంటి వద్ద భౌతికదేహాన్ని సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు, నగర కమిటీ సభ్యులు జి. వెంకట్రావు, శాఖా కార్యదర్శి ఎం.శ్రీను, యండి. మస్తాన్, పి. ప్రసాద్. ఎస్.కె. రఫీ తదితరులు సందర్శించి, నివాళులర్పించారు.

నివాళులర్పిస్తున్న బోయి సత్యబాబు

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరికి సామాజిక బాధ్యత కలిగి ఉండాలని మహిళా పోలీస్ స్టేషన్ సి ఐ వాసా వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని స్థానిక స్టార్ కళాశాలలో విద్యార్థినీలకు గురువారం వివిధ అంశాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో సాంకేతికత ఎంత పెరిగిందో అదే సమపాళ్లలో సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని, వాటికి కళ్లెం వేయాలంటే ప్రతి ఒక్కరికి సైబర్ నేరాల నుంచి ఎలా తప్పించు కోవాలో తెలియాలన్నారు. నేడు దయనందిన జీవితంలో స్మార్ట్ ఫోన్ ఒక భాగంగా మారిందని , దీనిని ఆధారంగా చేసుకుని సైబర్ నేరాలకు సైబర్ నేరగాళ్లు పెచ్చుమీరుతున్నారని, అనవసర లింకులు ఏ పి కె ఫైల్స్, అనవసర వీడియో కాల్స్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. మహిళల రక్షణ భద్రత కోసం డైల్ – 100, డైల్ – 112 ఉన్నాయన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలన్నారు. ఎస్ ఐ ఏండి మస్తాన్ ఖాన్, మహిళా హెడ్ కానిస్టేబుల్ విమల కుమారి, స్టార్ కాలేజ్ ప్రిన్సిపాల్ పి అయ్యప్ప స్వామి పాల్గొన్నారు.

ఎంఎల్ఎకు సత్కారం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రొటెం స్పీకర్, రాజమండ్రి రూరల్ నియోజకవర్గ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి దంపతులు గురువారం ఇంద్రకీలాద్రి బెజవాడ కనకదుర్గమ్మ దర్శనానికి విచ్చేశారు. అనంతరం తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి విచ్చేసిన దంపతులకు ఉత్తరాంధ్ర ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న బుద్దా వెంకన్న పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశపోగు రాజేష్, పునుగుపాటి చిన్న సుబ్బయ్య, ఈగల సాంబ, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.25 వేలు నష్టపరిహారం ఇవ్వాలి

• తారకరామానగర్‌లో సిపిఎం బృందం పర్యటన

ప్రజాశక్తి-విజయవాడ: వరద ముంపునకు గురైన తారక రామానగర్‌లో సిపిఎం బృందం గురువారం పర్యటించింది. ఇంటింటికీ తిరుగుతూ వరద ముంపుకు గురైన గృహాల యజమానులను పరామర్శిస్తూ, వారి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాలుగైదు అడుగుల మేర నీరు నిలబడటంతో గృహాలతో పాటు ఇళ్లల్లోని సామానులు మొత్తం దెబ్బతిన్నాయని, కట్టుబట్టలతోనే బయటపడ్డామని వరద ముంపు బాధితులు నాయకుల ఎదుట వాపోయారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం జరిగినా కానీ తమకు వరద ముంపు తప్పలేదని, తమను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పుప్పాల కష్ణ మాట్లాడుతూ కనీవినీ ఎరుగని రీతిలో వచ్చిన కష్ణా నది వరద ఉధృతికి రామలింగేశ్వర్‌నగర్ శ్మశానం వైపు నుంచి తారకరామానగర్, ఇతర ప్రాంతాల ఇళ్లల్లోకి నీరు చేరి పెద్ద ఎత్తున గృహాలతో పాటు సామానులు పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు. ఐదు రోజుల పాటు నీళ్లలోనే ఇళ్లన్నీ ఉండి, దెబ్బతిన్నాయని అన్నారు. వీరందరికీ కూడా నష్టపరిహారం రూ. 25 వేలు పెంచి వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. తూర్పు నియోకవర్గ పరిధిలో రాణీగారితోట, రామలింగేశ్వర నగర్ ప్రాంతాల్లోని తారక రామానగర్, భూపేష్ గుప్తా నగర్, గాంధీ కాలనీ వాసుల ఇళ్ళు 5 రోజుల పాటు నీళ్ళలో మునిగి ఉన్నాయన్నారు. వందలాది గృహాలు వరద నీటికి పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. రిటైనింగ్ వాల్ ఉండడం వలన పెద్దగా వరద ఇబ్బందులు ఉండవు అని, ప్రభుత్వం నుండి కూడా ఎటువంటి ముందస్తు హెచ్చరికలు లేకపోవడం వలన ప్రజలు ఏమరుపాటుగా ఉన్నారన్నారు. అర్ధరాత్రి వచ్చిన వరదలు పూర్తిగా ఇళ్లను ముంచేశాయన్నారు. గతంలో కనీసం సామానులు గట్టు మీదకు చేర్చే వాళ్ళమని, ఈసారి కట్టు బట్టలతో బయటకు రావాల్సి వచ్చింది ప్రజలు వాపోతున్నారన్నారు.. 10రోజుల పాటు పనులు కోల్పోయారు, ఆర్థికంగా తీవ్ర నష్టం జరిగిందని, కిరాణా షాపులు, కుటీర పరిశ్రమలు, చిన్న చిన్న వ్యాపారస్తులు పూర్తిగా దెబ్బతిన్నారన్నారు. ఇళ్లలో ఉన్న సామానులు నీట మునిగి పాడైపోయాయన్నారు. తీవ్ర విషాదం మిగిల్చిన ఈ వరద నష్టం ప్రజలకు కన్నీటినే మిగిల్చింది. ప్రభుత్వం బాధితుల పట్ల మానవతా దక్పథంతో వ్యవహరించాలన్నారు. ఒక్కో కుటుంబానికి లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందన్నారు.. నీట మునిగిన ప్రతి ఇంటికి రూ. 25000 పరిహారం ఇవ్వాలని కోరారు. కనీస అవసరాలు తీరాలన్నా, దెబ్బ తిన్న ఇళ్ళు, సామానులు బాగుచేయించు కోవాలన్నా ఇది కనీస అవసరం అని బాధితులకు న్యాయం చేయలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు టి.చంద్రశేఖర్, వై.కష్ణ, ఎన్.నాగేశ్వరరావు, కోటి రెడ్డి, ఆదామ్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

దుర్గమ్మను దర్శించుకున్న గోరంట్ల

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రొటెం స్పీకర్, రాజమండ్రి రూరల్ శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి దంపతులు గురువారం దుర్గమ్మ దర్శనానికి విచ్చేశారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు.

ఇసుజు డి మ్యాక్స్ వాహన శ్రేణి ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: వాణిజ్య వాహన శ్రేణిలో ఇసుజు డి మ్యాక్స్ పేరుతో కొత్త క్యాబ్ ఛాసిస్ వేరియంట్‌ను ప్రారంభించినట్లు ఇసుజు మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్ కియోషి తెలిపారు. నగరంలోని ఇసుజి మోటార్స్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలియచేశారు. కొత్త ఇసుజు డి మ్యాక్స్ వాహనాల ద్వారా ఎఫ్ఎంసిజి, ఫుడ్ అండ్ క్యాటరింగ్, లాస్ట్ మైల్ డెలివరీ వంటి వివిధ వ్యాపారాలలో సుదూరం ప్రయాణించే విధంగా వాహనాలను రూపొందించారని తెలిపారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఈవాహనాలను రూపొందించినట్లు పేర్కొన్నారు. త్వరలో వాణిజ్య వాహన శ్రేణిలో నూతన వాహనాలను తీసుకువచ్చేందుకు తమ సంస్థ ఇప్పటికే ప్రణాళికలను సిద్ధం చేసినట్లు తెలిపారు.

చిన్నారులకు అన్నదానం

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండలం, శ్రీరాంపురం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు వెల్ది రాంబాబు మనవరాలు సుంకర సంహిత పుట్టినరోజు సందర్భంగా రెడ్డిగూడెం లిఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీలి స్వచ్ఛంద సేవా సంస్థల డేకేర్ సెంటర్‌లో నిరుపేదలైన వారికి ప్రేమవిందు (అన్నదానం) నిర్వహించారు. వారికి సంస్థ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపురం గ్రామ టిడిపి అధ్యక్షులు బండ్లమూడి జగదీష్, ఉపాధ్యక్షులు జుంజునూరి రాజా, నాదెండ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాయిపై అక్కినేని చిత్రం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: అక్కినేని నాగేశ్వరరావు జయంతి సందర్భంగా జగ్గయ్యపేట పట్టణానికి చెందిన చిత్రకారుడు అల్లి చంద్రశేఖర్ అక్కినేని నాగేశ్వరరావు చిత్రాన్ని గీశారు. గుండ్రాయిపై బ్లాక్ మార్కర్ పెన్నుతో, మొక్కజొన్న పొత్తుపై మార్కర్ పెన్నుతో, ప్లాస్టిక్ పేపర్ పై బ్లాక్ పెన్సిల్, పెన్సిల్ షేడ్స్ తోను హెయిర్ స్టైల్ లో అక్కినేని అనే ఇంగ్లీష్ అక్షరాలు విధంగా అద్భుతంగా చిత్రీకరించారు.

నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: విజయవాడలోని లిటిల్ బ్రైన్స్ పాఠశాల ఆధ్వర్యంలో వరద ప్రభావిత ప్రాంతాలలోని పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ శ్రీలక్ష్మీచ పిఎం.రావుల చేతులమీదుగా లిటిల్ బ్రైన్స్ పాఠశాల డైరెక్టర్, ప్రముఖ వ్యక్తిత్వ నిపుణులు ఫణి ప్రసాద్ ముక్తేవి నిర్వహణలో 10వేల నోట్ పుస్తకాలు, పెన్నులు అందచేశారు. ఈ సందర్భంగా ఫణి ప్రసాద్ ముక్తేవి మాట్లాడుతూ వరదల కారణంగా బ్యాగులు పాడైపోయి, పుస్తకాలు తడిసిపోయి విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వరద ప్రభావిత కుటుంబాల్లో విద్య పరంగా విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది రాకుండా ఉండేందకు తాము విద్యార్థులకు నోట్ పుస్తకాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. తనతో పాటు కొంత మంది సహకారం వల్లనే ఉచితంగా అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విసిఎస్ అండ్ టిఎ అధ్యక్షులు టి.శ్రీనివాస్, సింగ్‌నగర్ డివిజన్ అధ్యక్షులు జి.స్లీవా, స్థానికులు కె.జగదీష్, సతీష్‌లు పాల్గొన్నారు.

సైబర్ సిటిజన్ యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి-విజయవాడ: స్థానిక మాచవరంలోని సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో విద్యార్థులకు సైబర్ క్రైమ్ సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న నేరాలపై సైబర్ సిటిజన్ యాప్ ద్వారా సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్లు పి.శ్రీనివాస్, మాచవరం ఇన్స్పెక్టర్ ప్రకాష్‌రావు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్లు మాట్లాడుతూ సైబర్ నేరం అంటే ఏమిటి? సైబర్ నేరాలు ఏ విధంగా ఉంటాయి? సైబర్ నేరానికి గురికాకుండా ఉండాలంటే ఏ జాగ్రత్తలు తీసుకోవాలి? నేరం జరిగిన పక్షంలో ఏ విధంగా ఫిర్యాదు చెయ్యాలి? ఫిర్యాదు సమయంలో దర్యాప్తు అధికారులకి సమర్పించాల్సిన ఆధారాలు ఏమిటి వాటిని ఎలా సేకరించాలి? వంటి విషయాల పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా, సైబర్ నేరాలకి గురికాకుండా ఉండాలంటే ఏవిధంగా ముందస్తు చర్యలు తీసుకోవాలి, ఒక వేళ సైబర్ నేరానికి గురైతే ఏవిధంగా స్మార్ట్‌ఫోన్‌ను తెలివిగా ఉపయోగిస్తే క్షణాల్లో ఏ సమాచారమైనా అరచేతిలో అందుబాటులో ఉంటుందని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అంతేవేగంగా కష్టాల్లో పడతామన్నారు. .ఎవరైనా నగదు మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్ లైన్‌కు ఫోన్ చేయాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-భవానీపురం: భవానీపురం పరిధిలోని 11 కెవి భవానీపురం ఫీడర్ లైన్ల మరమత్తులలో భాగంగా ఈ నెల 20వ తేదీ ఉదయం 8 నుండి 10 గంటల వరకు పాటు భవానీపురం పరిధిలోని మానవమందిరం రోడ్డు, స్వాతి రోడ్, పోపూరి వారి వీధి, ఎం.ఎస్ దాస్ స్ట్రీట్, హనుమయ్య వీధి, ,గుడివాడ రామారావు వీధి వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, విజయవాడ టౌన్ బి.వి.సుధాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సుందరమ్మ హైస్కూల్‌కు బియ్యం అందజేత

ప్రజాశక్తి-వన్‌టౌన్: స్థానిక వన్‌టౌన్‌లోని సుందరమ్మ హై స్కూల్ పాఠశాలకు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) ఆదేశాల మేరకు గురువారం 50 కిలోల బియ్యం అందజేశారు. ప్రిన్సిపల్ రత్నకుమారి కోరిక మేరకు కార్యాలయ సిబ్బంది పాఠశాలకు వెళ్లి బియ్యం అందించారు.

మసీదులకు మైక్ సెట్లు, కార్పెట్లు పంపిణీ

ప్రజాశక్తి-వన్‌టౌన్: అంజుమన్ అహలే ఇస్లాం ప్రొద్దుటూరు కడప జిల్లా, కర్నూలు ముస్లిం సోదరులు మరియు జాహిద్ అలీఖాన్ ఆధ్వర్యంలో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి సహకారంతో విజయవాడ వరద ప్రాంతంలో నష్టపోయిన మసీదులకు మైక్ సెట్లు, ముసల్లాలు (కార్పెట్)లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ శాఖ,న్యాయ శాఖ మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూక్ పంపిణీ చేశారు. గురువారం ముసాఫిర్‌ఖానాలో జరిగిన కార్యక్రమంలో పలు మసీదులకు వీటిని అందచేసారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్.ఎస్.బేగ్, ఎమ్.హెచ్.పి.ఎస్. అధ్యక్షులు ఫరూక్ షుబ్లీ, మౌలానా హుస్సేన్ అహ్మద్, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

పాల ఫ్యాక్టరీ పునరుద్ధరణకు సాయం చేయండి

ఎన్‌డిడిబి చైర్మన్‌కు కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ ఆంజనేయులు వినతి

ప్రజాశక్తి-వన్‌టౌన్: వరదలకు నష్టపోయిన విజయవాడ పాలఫ్యాక్టరీకి సాయం అందిచాలని గురువారం ఢిల్లీ ఐకార్‌లో జరుగుతున్న డెయిరి కాన్ఫరెన్స్‌లో నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌డిడిబి) ఛైర్మన్ డాక్టర్ మీనేష్‌షాని కలిసి కష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు , మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు వినతిపత్రం సమర్పించారు. విజయవాడలో ఇటీవల వచ్చిన తుపాన్ వరదల వల్ల కష్ణా మిల్క్ యూనియన్, విజయవాడ ఫ్యాక్టరీ పూర్తిగా ముంపునకు గురై అపార నష్టం వాటిల్లిందని తెలియపరిచారు. గతంలో సమితి సంక్షోభాలలో ఉన్నప్పుడు ఎన్‌డిడిబి అనేకసార్లు మద్దతుగా నిలిచిందని, ఈ విపత్కర పరిస్థితులు అధిగమించడానికి, ఫ్యాక్టరీ పునరుద్ధరణకు తక్షణ సహాయం అందించాలని వినతిపత్రంలో కోరారు. ఈ సందర్భంగా ఎన్‌డిడిబి ఛైర్మన్ డాక్టర్ మీనేష్ షా సానుకూలంగా స్పందించి, ఫ్యాక్టరీ పునరుద్ధరణకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారని ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా జి. కిషోర్, రీజినల్ హెడ్ (దక్షిణ రీజియన్ హెడ్) నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌డిడిబి) వారికి కూడా వినతిపత్రం అందచేయడం జరిగింది.

పాల ఫ్యాక్టరీ పునరుద్ధరణకు వినతిపత్రం అందిస్తున్న ఆంజనేయులు

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఇటీవల వరద ముంపు ప్రాంతాల్లోని పలువురు బాధితులకు వైసీపీ అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహనరెడ్డి ఆదేశాల మేరకు పశ్చిమ వైసీపీ నాయకులు షేక్ ఆసిఫ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరకులను పంపిణీ చేసినట్లు వైసీపీ పశ్చిమ యువనాయకులు కర్రి గౌరి చెప్పారు. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. వరద బాధితులకు అవసరమైన సహాయ సహకారాలను అందచేసేందుకు తమ నాయకులు జగనన్న సారథ్యంలో తామెప్పుడూ సిద్ధమేనని అన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.